veluturu telugu daily
వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి నల్గొండ   గురువారం 8.10.2026
సంపుటి : 9   సంచిక : 116
www. veluturu.com



దేశ ప్రజలకు శిరస్సు వంచి
నమస్కరిస్తున్నా

వెలుతురు, ఢిల్లీ:

దేశ ప్రజలే తనకు దైవ స్వరూపమని, వారి నమ్మకమే తన బలమన్న ప్రధాని 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా మొదలైన ఆయన ప్రస్థానంప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. నేడు ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో పాల్గొన్న మోదీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ 'భారత్ మాతా కీ జై', 'స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోదీజీ కా స్వాగత్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.."2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలురాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారు" అని తెలిపారు. "నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు.

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల మైలురాయిని పూర్తి చేసుకున్న మోదీ
- ఈ స్థాయికి చేరుకుంటానని తాను ఎన్నడూ ఊహించలేదని వ్యాఖ్య
- ప్రజల నిరంతర ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైందంటూ దేశ ప్రజలకు కృతజ్ఞతలు

తెలంగాణలో మరో పొలిటికల్ బాంబు పేలనుందా? కెసిఆర్ ఫామ్ హౌస్ లో అక్రమాలపై నిగ్గు తేల్చనున్నారా? అందుకు సంబంధించి విచారణ ప్రక్రియ కీలక దశకు చేరుకుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. కెసిఆర్ కు చెందిన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిసర భూముల సర్వే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఆ ఫామ్ హౌస్ పరిధిలో సుమారు 388 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కలిసి పోయావంటూ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రకటన చేశారు. సమగ్ర సర్వే చేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. జిల్లా అదనపు కలెక్టర్, గజ్వేల్ ఆర్డీవో, సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ప్రత్యేక అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు ముమ్మరం చేశాయి. ఫామ్ హౌస్ పరిసర ప్రాంతాల్లో మొదటి దశ సర్వేను దాదాపు పూర్తి చేశాయి. - వెలుతురు, తెలంగాణ బ్యూరో

ఇక కేసీఆర్
కోట కొలత
ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై రెండో దశ సర్వే..!

- తొలి విడతలో పరిసర భూముల పరిశీలన పూర్తి
- కాంపౌండ్ వాల్ దాటి అడుగుపెట్టనున్న అధికారులు
- టెన్షన్.. టెన్షన్.. సంచలనాలకు అవకాశం

సీఎం ప్రకటనతో ప్రకంపనలు..

కెసిఆర్‌కు చెందిన ఫామ్ హౌస్ లో ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఎం రేవంత్ అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకంపనలు రేపింది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారుల బృందాలు సర్వే నంబర్ 325 పరిధిలోని ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వరద రాజ్ పూర్ సరిహద్దుల్లోని భూములను అధికారులు ప్రధానంగా పరిశీలించారు. ఇందులో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? పట్టా భూమి ఎంత? అనే లెక్కలను తేల్చేందుకు పాత రికార్డులు, మండల తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను బయటకు తీశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ సరిహద్దులను గుర్తించడానికి రెవెన్యూ సిబ్బంది కేవలం పాత రికార్డులకే పరిమితం కాకుండా.. రోవర్లు, డ్రోన్లు, పాత సాటిలైట్ మ్యాప్ లను ఉపయోగించి గూగుల్ ఎర్త్ ఆధారంగా భూమి స్వరూపం గతంలో ఎలా ఉంది? ఇప్పుడు ఎలా మారిందని అంశాలపై సాంకేతిక నిర్ధారణ చేసుకుంటున్నారు.

దాదాపు ముగింపు దశకు..

ఫామ్ హౌస్ పరిసర ప్రాంతాల్లో తొలి విడత సర్వేను దాదాపు ముగింపు దశకు తీసుకువచ్చారు అధికారులు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో ఫామ్హౌస్ వెలుపల ఉన్న పరిసర ప్రభుత్వ భూములు, సరిహద్దుల గుర్తింపు మాత్రమే పూర్తి చేశారు తప్ప.. నేరుగా కెసిఆర్ ఫామ్ హౌస్ కాంపౌండ్ లోపలికి వెళ్లి సర్వే చేయలేదు. తొలి దశలో సేకరించిన ప్రాథమిక వివరాలు, సరిహద్దు కొలతలతో కూడిన నివేదికను అధికారులు సిద్ధం చేశారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలోని ప్రభుత్వ భూమి హద్దులు ఫామ్ హౌస్ ప్రహరీ లోపలికి విస్తరించి ఉన్నాయా? లేదా? అనేది తేల్చడానికి రెండో దశలో నేరుగా ఫామ్ హౌస్ లోకి ప్రవేశించనున్నారు. అయితే ఈ రెండో విడత క్షేత్రస్థాయి సర్వే జరిపితే మాత్రం సంచలనాలు నమోదయ్యే అవకాశం ఉంది. కెసిఆర్ ఫామ్ హౌస్ విషయంలో మాత్రం గులాబీ పార్టీ శ్రేణులు ఆందోళనతో ఉన్నాయి.

"యంగ్ ఇండియా" రయ్.. రయ్..

- ఊపందుకున్న పాఠశాలల నిర్మాణాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో పాఠశాలలకు ప్రణాళిక
- 87 చోట్ల వివిధ దశల్లో పాఠశాలల పనులు
- నిర్మాణాలకు రూ. 1,144.85 కోట్ల నిధులు విడుదల

- వివరాలు 12 లో..

రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి మచ్చ

- రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గం
- చలో రాజ్‌భవన్" నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, వెలుతురు:

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని వరుసగా రెండోసారి అరెస్టు చేయడాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తీవ్రంగా ఖండిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి తర్వాత అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన ప్రతిపక్ష నాయకుడి పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చేసిన తప్పిదాలను ప్రజల ముందుకు తీసుకువచ్చినందుకే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. ఇండియా కూటమి నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ,

- మిగతా 2 లో..

ఓటు.. సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే

2 లో

- నెహ్రూను ప్రధాని చేయడమే తొలి ఓటు, సీటు చోరీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు: బండి

దసరాకు టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

7 వేల ప్రత్యేక బస్సుల ఏర్పాటు..

- రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు
- 9, 10, 16, 17, 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- మహిళలకు ఉచిత ప్రయాణం యథావిధి.. ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం

హైదరాబాద్, వెలుతురు:

దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3,533 బస్సులు నడుపుతోంది. ప్రాంతాల వారీగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678 బస్సులు ఉన్నాయి. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు నడుపుతుండగా ప్రాంతాల వారీగా మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440 బస్సులను ఏర్పాటు చేసింది. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి దసరా పండుగకు 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది.

ప్రధానంగా ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది. అలాగే ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్లచెరువు), ఆరాంఘర్, ఎల్బీనగర్ కూడలి, కేపీహెచ్‌బీ,

- మిగతా 2 లో..

దేశమే ధ్యాసగా.. ప్రజాసేవే శ్వాసగా..

ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రయాణం

- ఎన్ని సవాళ్లు ఎదురైనా మోదీ ఆశీర్వాదంతో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తాం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి

2 లో

ఉపాధి హామీకి 'అక్టోబర్' జోష్

- రోజుకు 2.54 లక్షల మందితో సరికొత్త రికార్డు
- గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా అక్టోబర్‌లో
- రోజుకు 2.54 లక్షల మందికిపైగా హాజరు
- వేజ్ సీకర్ల సంఖ్య మరింత పెంచాలని మంత్రి సీతక్క ఆదేశం

12

ఓటు.. సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే

- నెహ్రూను ప్రధాని చేయడమే తొలి ఓటు, సీటు చోరీ
- ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ.. బీజేపీ జేబు సంస్థ కాదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు: కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 07: ఓటు చోరీ, సీటు చోరీ పేటెంట్ హక్కులు కాంగ్రెస్‌కే ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశంలో మొట్టమొదటి ఓటు, సీటు చోరీకి పాల్పడిన పార్టీ కాంగ్రెస్టనని ఆరోపించారు. 1946లో దేశంలోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలన్నీ తొలి ప్రధాని అభ్యర్థిగా సర్దార్ పటేల్ పేరును ప్రతిపాదించగా, ఒక్క పీసీసీ మద్దతు కూడా లేని నెహ్రూను ప్రధాని చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని విమర్శించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు.

ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ పదవ చౌరస్తా వరకు 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభకు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వర్చువల్‌గా ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

మోదీకి సొంత కుటుంబం లేదని, దేశ ప్రజలే ఆయన కుటుంబమని బండి సంజయ్ అన్నారు. డబ్బులు, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదన్నారు. ప్రధాని పదవి నుంచి దిగిపోయినా భుజానికి సంచి వేసుకుని ప్రజాసేవలో తరించే మహనీయుడు మోదీ అని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించేందుకు మోదీ పనిచేస్తున్నారని తెలిపారు.

ఎన్నికల సంఘంపై దాడి సరికాదు

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ అన్నారు. రాజ్యాంగ సంస్థలను బదనాం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ విషయంలో ఏమైనా తప్పు జరిగిందని భావిస్తే కోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు. చనిపోయిన పీవీ నరసింహారావు పేరు ఇటీవలి వరకు ఓటర్ల జాబితాలో ఉందని, ఎస్ఐఆర్‌తో ఆ ఓటును తొలగించారని చెప్పారు. 2.8 కోట్ల మంది చనిపోయారని, వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ చెప్పిందన్నారు. తెలంగాణలో 70 లక్షల దొంగ ఓట్లున్నాయని అభిషేక్ సింఘ్వీ, మధ్యప్రదేశ్‌లో 60 లక్షల దొంగ ఓట్లున్నాయని, రాజస్థాన్‌లో 45 లక్షల డూప్లికేట్ ఓట్లున్నాయని సచిన్ పైలట్ చెప్పారని పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు

కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతూ డ్రామా ఆడుతోందని బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే దమ్ము బీఆర్ఎస్‌కు కూడా లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

ప్రతి ఇంటి ముందు సోలార్

- పీచుపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- ప్రజా సమస్యల పరిష్కారమే పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లె పల్లెలో ప్రజా పాలన

కరీంనగర్, వెలుతురు:

హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం పీచుపల్లి గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. గ్రామ ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకోవడమే పర్యటన ఉద్దేశమని తెలిపారు.

పీచుపల్లిలో సంక్షేమ ఫలాలు

ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పీచుపల్లి గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని మంత్రి తెలిపారు. 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా,రెండో విడతలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. 115 మందికి చేయూత పింఛన్లు అందుతుండగా, కొత్తగా 17 పింఛన్లను గుర్తించారు. 149 కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సబ్సిడీ అందుతోంది. 17 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.6.61 లక్షల సున్నా వడ్డీ రుణాలు, 17 సంఘాలకు బ్యాంకు అనుసంధానం కింద రూ.3.89 కోట్ల రుణాలు, 10 సంఘాలకు శ్రీనిధి కింద రూ.10.29 లక్షలు విడుదల చేశారు. 796 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. 43 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.40.89 లక్షలు, 331 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1.92 కోట్లు అందించారు. రైతు బీమా కింద ఒక రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు, సన్న వడ్ల బోనస్ కింద ఒక రైతుకు రూ.25,600 అందించారు. 5 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, 36 మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు 59 మంది పేర్లను అదనంగా చేర్చారు. 222 రేషన్ కార్డులకు సన్న బియ్యం పంపిణీ జరుగుతోంది. పీచుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.5 లక్షలతో వంటగది షెడ్డు నిర్మించారు. రూ.40 లక్షలతో వివిధ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో గ్రామ సమాఖ్య భవనం నిర్మించారు.పీచుపల్లి-పర్లపల్లి మధ్య వంతెన నిర్మాణ పనులకు రూ.80లక్షలు కేటాయించారు.

పీచుపల్లిని సౌర గ్రామంగా తీర్చిదిద్దాలి

పీచుపల్లి గ్రామం సౌర విద్యుత్ వినియోగంలో ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. "పీచుపల్లి గ్రామంలో ప్రతి ఇంటి ముందు సోలార్ కనిపించేలా చేయాలి. గ్రామాన్ని సౌర విద్యుత్‌లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి. రూ.2 లక్షల వ్యయంతో సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల వరకు రాయితీ, మిగతా మొత్తానికి బ్యాంకు రుణం అందించే అవకాశం ఉంది" అని అన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అదనపు ఆదాయం

రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ మొక్కలు, బిందు సేద్యం సదుపాయాలను అందిస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా మంచి ఆదాయం లభిస్తుందని, కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం ఇతర పంటలతో పోలిస్తే తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యం

వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, ప్రతి పొలంలో పంటకుంట, ప్రతి గ్రామంలో ఊరుకుంట ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జలసిరి కార్యక్రమం ద్వారా ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 వరకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు

పీచుపల్లి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు, పీచుపల్లి--నల్లగొండ బీటీ రోడ్డు, సౌర వీధి దీపాలు, గ్రామ సమాఖ్య భవనానికి స్థలం తదితర సమస్యలను సర్పంచ్ పీచు సత్యనారాయణ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామాల్లో పశువైద్య సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.

ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యం

గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పిల్లలకు సమయానికి టీకాలు వేయించాలని తెలిపారు.

దేశమే ధ్యాసగా.. ప్రజాసేవే శ్వాసగా..

ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రయాణం

- ఎన్ని సవాళ్లు ఎదురైనా మోదీ ఆశీర్వాదంతో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తాం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, వెలుతురు అక్టోబర్ 07:

సెప్టెంబర్ 17న నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభమైన సేవా సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు సేవ చేయడం, వారికి స్ఫూర్తినివ్వడం, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవడానికి వారికి ఒక దశ, దిశ చూపడం కోసం కొనసాగుతోంది. అందులో భాగంగానే ఈరోజు సేవా జ్యోతి కలశ యాత్రలో పాల్గొన్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఈ ప్రయాణం, భారత ప్రధాన మంత్రిగా దేశానికి నాయకత్వం వహించే స్థాయికి చేరిందని ఆయన అన్నారు. అందుకు కారణం దేశం పట్ల నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత, అభివృద్ధి పట్ల దృఢ సంకల్పమని పేర్కొన్నారు.

ప్రపంచ పటంలో భారతదేశ ఖ్యాతిని పెంచిన నాయకుడు నరేంద్ర మోదీ గారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మొఘలుల పాలన నుంచి బ్రిటిష్ పాలన వరకు... ఆ తర్వాత దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో వెనుకబడిన భారత్ను.. నేడు ప్రపంచ వేదికపై తనదైన స్థానం సాధించే దిశగా పునర్నిర్మాణం చేస్తున్న నాయకత్వం నరేంద్ర మోదీదని పేర్కొన్నారు.

'అబ్ కీ బార్ మోదీ సర్కార్', 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదాలు కోట్లాది మంది హృదయాలను తాకాయని ఆయన అన్నారు. దాదాపు మూడు దశాబ్దాలు ఒకే పార్టీకి ప్రజలు ఒక విప్లవాత్మకమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా మూడోసారి నరేంద్ర మోదీ గారిపై ప్రజలు విశ్వాసం ఉంచారని, ఆయన అందిస్తున్న పటిష్ఠమైన నాయకత్వమే అందుకు కారణమని అన్నారు.

అయితే, నరేంద్ర మోదీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ పార్టీ కుటిల రాజకీయాలు చేస్తోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. గతంలో ఎన్నికల్లో గెలిచినప్పుడు దేశంలో చాలా దొంగ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నేతలే చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు సర్ వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఓడిపోతున్నందుకే 'ఓటు చోరీ' అంటూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటకలో, తెలంగాణలో, కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని ఆయన ప్రశ్నించారు. గతంలో 7-8 సార్లు సర్ వంటి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలు జరిగినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.

'నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్' అనే సిద్ధాంతాన్ని పాటిస్తున్నందుకే నరేంద్ర మోదీ నాయకత్వం ప్రత్యేకమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎప్పుడూ ఒక ఖాందాన్ నుంచి ఒకరి తర్వాత మరొకరు ప్రధానమంత్రి కావాలనే ఆలోచనతోనే పనిచేస్తోందని విమర్శించారు.

2014లో ఎర్రకోటపై నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరుగుదొడ్ల గురించి మాట్లాడినప్పుడు దేశం ఆశ్చర్యపోయిందని ఆయన అన్నారు. అయితే, 2014కు ముందు దేశం ఎంత దయనీయమైన స్థితిలో ఉందో నరేంద్ర మోదీ దేశ ప్రజలకు వివరించారని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ ద్వారా ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడారని అన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ కింద 12.11 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారని,2014కు ముందు భారతదేశం ఎంత దయనీయమైన పరిస్థితుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

సర్జికల్ స్ట్రైక్ గురించి ప్రస్తావిస్తూ, హైదరాబాద్ లోని గోకుల్ చాట్, లుంబినీ పార్క్, ముంబై వంటి ప్రాంతాల్లో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు విమర్శించారు. 'ఘర్ మే ఘుస్ కే మారేంగే' అనే దృఢమైన వైఖరితో నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం పాకిస్థాన్లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిందని అన్నారు.

తెలంగాణలో ప్రజల ఇళ్లను, భూములను లాక్కుంటున్న పరిస్థితి మీ అందరికీ తెలుసని ఆయన అన్నారు. 22-m Prohibited List పేరుతో లక్షలాది మంది ప్రజలు భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో బీజేపీ గట్టిగా గళమెత్తిందని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారెవరినీ బీజేపీ వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

చివరిగా, తనను గెలిపించి ఆశీర్వదించిన నిర్మల్ ప్రజలకు 'మీ మహేశన్నగా' ఒక మాట చెబుతున్నానని, మోదీ గారి ఆశీర్వాదంతో ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని సవాళ్లు ఎదురైనా తెలంగాణలో కాషాయ జెండా ఎగరేసే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలందరం కలిసికట్టుగా పనిచేసి తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసి, కాషాయ జెండాను ఎగరేస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

నిరసనల ఎఫెక్ట్.. జ్ఞానేష్ కుమార్ అధికారిక పర్యటనలు వాయిదా

వెలుతురు, ఢిల్లీ: సీఈసీ జ్ఞానేష్ కుమార్ తన అధికారిక పర్యటనలను వాయిదా వేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నేడు, రేపు ఆయన ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించాల్సి ఉంది.దంతెవాడ, బస్తర్, కవర్ధా లాంటి ప్రాంతాల్లో పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్టు ఎన్నికల కమిషన్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఛత్తీస్‌గఢ్ పర్యటనకు సంబంధించి సవరించిన తదుపరి తేదీలను త్వరలోనే ప్రకటించనుంది. అయితే దేశవ్యాప్తంగా జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతుండటంతోనే పర్యటనలను వాయిదా వేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.అంతకుముందు సెప్టెంబర్ చివరివారంలోనూ ఆయన యూపీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో పర్యటించాల్సి ఉండగా పర్యటనలను వాయిదా వేసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు వ్యతిరేకంగా ఆందోళనలు పెరిగిపోయాయి. మంగళవారం జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ 300 మందికి పైగా ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ నుండి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వరకు అక్కడ హైడ్రామా నెలకొంది. మరోవైపు సీజేపీ సైతం ఆందోళనలు చేస్తోంది.

100 కోట్లకు చేరిన ఫ్రీ జర్నీ

వెలుతురు, విజయవాడ:

స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పథకం ప్రారంభానికి ముందు మహిళల ప్రయాణ వాటా సుమారు 40 శాతంగా ఉండగా.. ఏడాది తర్వాత అది 62 శాతానికి చేరినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. బస్సుల ఆక్యుపెన్సీ కూడా 90 శాతానికి పైగా నమోదవుతోంది.దీంతో బస్టాండ్లలో మహిళా ప్రయాణికుల సందడి పెరిగింది. గ్రామాల నుంచి పట్టణాలకు.. పట్టణాల నుంచి నగరాలకు వెళ్లే మహిళలకు ప్రజా రవాణా మరింత అందుబాటులోకి వచ్చింది.స్త్రీ శక్తి పథకం వల్ల మహిళల ప్రయాణం పెరగడంతో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ కూడా పెరిగింది. పథకం అమలుకు ముందు సుమారు 60 శాతం స్థాయిలో ఉన్న ఆక్యుపెన్సీ.. తర్వాత 90 శాతానికి పైగా నమోదైనట్లు అధికారికంగా వెల్లడైంది.మరోవైపు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడే మహిళలు ఆర్టీసీ వైపు మళ్లడం వల్ల ప్రజా రవాణా వినియోగం పెరిగిందని ప్రభుత్వం చెబుతోందిమహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ.. ఆర్టీసీపై పడే ఆర్థిక భారాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. తాజాగా ఏపీఎస్ఆర్టీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. పథకం అమలు కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,160 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం నెలకు సుమారు రూ.160 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తోంది.పథకం కోసం అవసరమైన బస్సులు, మౌలిక వసతులు, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇప్పటికే వంద కోట్ల ఉచిత ప్రయాణాలను దాటిన స్త్రీ శక్తి పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రభుత్వం, ఆర్టీసీ దృష్టి సారిస్తున్నాయి. బస్సుల సంఖ్య పెంచడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ప్రజా రవాణాను మరింత అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ఒకప్పుడు బస్సు ప్రయాణం అంటే ఖర్చు.. ఇప్పుడు అదే ప్రయాణం మహిళలకు పొదుపుగా మారింది.

టిడబ్ల్యుయు కూటమికి కాంగ్రెస్ పూర్తి మద్దతు

- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలలో టిడబ్ల్యుయు కూటమి ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లోని గౌలిగూడా సెంట్రల్ బస్ స్టేషన్ నిర్వహించిన గేట్ మీటింగ్ భారీ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ రెడ్డితో పాటు పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టిడబ్ల్యుయు కూటమికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బాణం గుర్తు అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల పక్షపాతి అని, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ శాస్త్రీయంగా, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే విధంగా జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందన్నారు. దేశంలోనే తొలిసారిగా గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బిల్లును తీసుకొచ్చామని, ఆటో కార్మికులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు అమలు చేయడంతో పాటు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించే విధానాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. 2019 ఆర్టీసీ సమ్మె సమయంలో కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులను కాంగ్రెస్ పార్టీ మరచి పోలేదని, గత పదేళ్ల పాలనలో కార్మిక వర్గం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు. కార్మికులను మోసం చేసిన శక్తులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాజిరెడ్డి, అశ్వత్థామ రెడ్డి తదితర టిడబ్ల్యుయు కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల గొంతుక బలంగా వినిపించాలంటే టిడబ్ల్యుయు కూటమి అభ్యర్థుల విజయం అవసరమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరై టిడబ్ల్యుయు కూటమికి తమ మద్దతును ప్రకటించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. టిడబ్ల్యుయు కూటమి ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సంజీవ రెడ్డి, డిసిసి పారిజాత నర్సింహ రెడ్డి,చల్లా నర్సింహారెడ్డి, బొంతు రామ్మోహన్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

దసరాకు టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పందిళ్లు, షామియానాలు, కుర్చీలు, ప్రజా ప్రకటన వ్యవస్థ, తాగునీటి సదుపాయం, మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయనుంది.

ప్రత్యేక బస్సులకు సవరించిన చార్జీలు

ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రత్యేక సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ, రద్దీ ఉన్న మార్గాల్లో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరితగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా మార్గాల్లో నడిపిస్తుంది. ఆ ప్రత్యేక బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకునేందుకు 2003లో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16ను జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్‌గా ఉన్నప్పటి నుంచి అమలు చేస్తోంది. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుంచి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తోంది.

25, 26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు

ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10, 16, 17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25, 26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. ప్రత్యేక బస్సులు మినహా సాధారణ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరాకు నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ సాధారణ, ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరాకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి మచ్చ

(మొదటిపేజీ తరువాయి)

వారిని అరెస్టు చేసి అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో విభిన్న అభిప్రాయాలను అణిచివేసేందుకు అరెస్టులను ఆయుధంగా ఉపయోగించడం పిరికితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ విమ ర్శించారు. ఇండియా కూటమి నాయకులు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభు త్వం పట్టించుకోకుండా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని అన్నారు. దేశ ప్రజలు బీజేపీ ప్ర భుత్వ వైఖరిని గమనిస్తున్నారని, మోడీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా రోజులు దగ్గరపడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే "చలో రాజ్‌భవన్" నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న అన్ని వర్గాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓటు విలువను కాపాడే

రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

- ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి
- ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారి ప్రశ్నలను అణచలేరు
- ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన రాహుల్ గాంధీకి అభినందనలు
- నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 7: "ప్రజల ఓటు విలువను కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు బారికేడ్లతో ఆపలేరు. ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారు లేవనెత్తిన ప్రశ్నలు మాయమైపోవు. సమాధానం కోసం నిలబడిన గొంతును అడ్డుకుంటే, ఆ ప్రశ్న మరింత బలంగా దేశమంతటా ప్రతిధ్వనిస్తుంది," అని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల పారదర్శకత కోసం దృఢంగా నిలబడి, ప్రతిపక్ష నిరసనకు నాయకత్వం వహించిన రాహుల్ గాంధీకి ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ఎన్నికల సంఘం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంపై మరింత చర్చకు దారితీసిందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై వివరణ కోరుతున్న నాయకులను అడ్డుకున్న దృశ్యాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయని అన్నారు. "బారికేడ్ల ఎత్తుతో ప్రజాస్వామ్య బలాన్ని కొలవలేరు. ప్రజల సందేహాలకు ఇచ్చే సమాధానాల స్పష్టతలోనే వ్యవస్థల బలం కనిపిస్తుంది," అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షికతతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. "రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను నిలబెట్టేది అధికార దర్పం కాదు; ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలి. సంస్థను ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమంటూ భావించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం," అని అన్నారు. ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను రాజకీయ విమర్శలంటూ కొట్టిపారేయడం సరికాదని ఉత్తమ్ పేర్కొన్నారు. "అర్హుడైన ఒక్క పౌరుడి పేరు అన్యాయంగా తొలగినా, అది ఆ వ్యక్తి హక్కుకు జరిగిన నష్టం. అలాంటి అభ్యంతరాన్ని చిన్న విషయంగా తీసుకునే అవకాశం ఎవరికీ లేదు. జాబితాల సవరణకు అనుసరించిన ప్రమాణాలు, పేర్ల తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార విధానం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఆధారాలతో లేవనెత్తిన ఆరోపణలను నిష్పాక్షికంగా పరిశీలించి, ఆ పరిశీలన ఫలితాలను బహిరంగంగా వెల్లడించాలి," అని డిమాండ్ చేశారు. ఓటు చోరీ ఆరోపణలను దేశవ్యాప్త చర్చలోకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. "సామాన్యుడి చేతిలోని ఓటు అతడి ఆత్మగౌరవానికి ముద్ర. పాలకులను ఎన్నుకునే అతడి స్వేచ్ఛకు ఆయుధం. ఆ ఓటుపై అనుమానపు నీడ పడితే ప్రజాస్వామ్య పునాదులే దెబ్బతింటాయి." ప్రతి ఓటుకూ విలువ ఉండాలని, ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని రాహుల్ గాంధీ పట్టుబడుతున్నారని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో ఆయన చేస్తున్న పోరాటం దేశ ప్రజలందరికీ సంబంధించినదని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఉందని ఉత్తమ్ అన్నారు. "ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత నుంచి పాలకులు తప్పించుకోలేరు. విమర్శలను అవహేళన చేయడం, ప్రశ్నించే వారిపై రాజకీయ దాడులకు దిగడం ద్వారా సందేహాలు తొలగవు. ప్రజల తీర్పుతో ఏర్పడే ప్రభుత్వాల విశ్వసనీయతను కాపాడాలంటే, ఆ తీర్పు వెలువడే ఎన్నికల ప్రక్రియపై పూర్తి నమ్మకం ఉండాలి," అని పేర్కొన్నారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలపై పట్టుదలగా ప్రశ్నించడం రాహుల్ గాంధీ నాయకత్వంలో కనిపించే లక్షణమని మంత్రి అన్నారు. 2016లో పెద్ద నోట్ల రద్దుతో పేదలు, చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. 2020 మార్చిలో కోవిడ్ కారణంగా పొంచి ఉన్న తీవ్రమైన ఆర్థిక దెబ్బపై హెచ్చరించారని, లడఖ్ సరిహద్దు పరిణామాలపై దేశానికి స్పష్టత ఇవ్వాలని పదేపదే కోరారని అన్నారు. ప్రజల ఆందోళనలను అధికార వ్యవస్థల ముందుంచడంలో ఆయన చూపిన పట్టుదల ఇప్పుడు ఎన్నికల పారదర్శకత పోరాటంలోనూ కనిపిస్తోందని పేర్కొన్నారు. "సంక్షోభం ముంచుకొచ్చిన తరువాత సానుభూతి ప్రకటించడంతో నాయకత్వ బాధ్యత ముగియదని, ప్రమాదాన్ని గుర్తించినప్పుడు హెచ్చరించాలని, ప్రజలకు నష్టం కలిగితే నిలదీయాలని, సమాధానం దొరికే వరకు పట్టుబట్టాలని, రాహుల్ గాంధీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. ఆయన ప్రశ్నలను తేలికగా తీసుకున్నవారు, వాటి వెనుక ఉన్న ప్రజల ఆందోళనను వినాల్సిందే," అని ఉత్తమ్ అన్నారు. పోలీసుల చర్యలు రాహుల్ గాంధీ పట్టుదలను తగ్గించలేకపోయాయని, ఎన్నికల పారదర్శకత కోసం ఉన్న డిమాండ్‌ను మరింతగా ప్రజల ముందుకు తెచ్చాయని మంత్రి పేర్కొన్నారు. "ఒక నాయకుడిని అదుపులోకి తీసుకోవచ్చు. కోట్లాది ప్రజలకు సంబంధించిన ఓటు హక్కు ప్రశ్నను మాత్రం నిర్బంధించలేరు. ఆ ప్రశ్నకు జవాబు దొరికే వరకు ప్రజాస్వామ్య చర్చ కొనసాగుతుంది," అని అన్నారు. ప్రతిపక్షం లేవనెత్తిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం విశ్వసనీయమైన, బహిరంగ ప్రక్రియ ద్వారా సమాధానాలు ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. "అధికార పీఠాలు మారుతుంటాయి. ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకం తరతరాలకు నిలవాలి. ప్రతి ఓటును కాపాడటం ద్వారా ఆ నమ్మకాన్ని కాపాడాలి. ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ అండగా నిలుస్తుంది. ప్రజల ఓటు విలువను కాపాడే బాధ్యత విషయంలో వెనకడుగు ఉండదు," అని ఆయన స్పష్టం చేశారు.

250 కోట్లతో శరవేగంగా

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం

నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, వెలుతురు అక్టోబర్ 07 : మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారు మంత్రి వాకిటి శ్రీహరి. ఇందులో భాగంగా మక్తల్‌లో 250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. శరవేగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి.. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉండేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు .మక్తల్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు, విద్యుత్ తదితర రంగాల్లో అభివృద్ధి పనులను వేగంగా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి, ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

పండగ రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(వెలుతురు): రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా ప్రయాణికుల అదనపు రద్దీని నివారించడానికి దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణ యం తీసుకుంది. బెంగళూరు కంట్ -- బీదర్, యశ్వంత్‌పూర్ సహర్స మార్గాల్లో పండుగ ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.

ఆదిలాబాద్‌లో ఘనంగా "సేవా జ్యోతి"

- పాల్గొన్న అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 07: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజా జీవితంలో విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు అదిలాబాద్‌లో "సేవా జ్యోతి" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) గోడం నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో భాగంగా అదిలాబాద్‌లోని ఎస్‌టీయూ భవన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం "సేవా జ్యోతి" కార్యక్రమంలో భాగంగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నరేంద్ర మోదీ గారి 25 ఏళ్ల ప్రజా జీవితం దేశానికి అంకితమని నాయకులు తెలిపారు. ప్రజా సేవ, అభివృద్ధి, దేశ నిర్మాణం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, బ్రహ్మానంద, రాందాస్, విజయ్, తాటిపెల్లి రాజు, రాకేష్ శైలేందర్, సాయి సుమన్, భాయి ధోని, జ్యోతి తదితర మండల, జిల్లా స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మూగబిడ్డకు

మంత్రి వెంకన్న 'చేయూత'

- వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల ఆర్థిక సాయం
- మరోసారి ఉదారత చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మెరుగైన వైద్యం అందించేందుకు అండగా ఉంటా
- బాధిత కుటుంబానికి భరోసానిచ్చిన మంత్రి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 07 : రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలిచి, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్స అందించేందుకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పనిగిరి గ్రామ నివాసులు జంపాల మహేష్ కుమార్, రజిత దంపతులు ఇద్దరూ మూగ, చెవిటి వారు. వారికి జన్మించిన బిడ్డ కూడా మూగ, చెవిటి తనంతో పుట్టడంతో ఆ తల్లిదండ్రుల జీవితాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ బిడ్డకు సరైన వైద్యం అందిస్తే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబంలో కొంత ఆశ చిగురించింది. అయితే, ఇందుకు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ దంపతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి ఎంతో ఆప్యాయతతో స్పందించారు. చిన్నారిని స్వయంగా ఎత్తుకుని అక్కున చేర్చుకుని, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చిన్నారి వైద్య చికిత్స కోసం రూ. 2 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. అంతేకాకుండా, చిన్నారికి మెరుగైన వైద్యం అందించే విషయంలో వైద్యులతో స్వయంగా మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చారు. "మీ బిడ్డ విషయంలో ఆందోళన చెందవద్దు. ఏ సహాయం కావాలన్నా నేను అండగా ఉంటాను" అంటూ ఆ దంపతులకు భరోసా కల్పించారు.

కైంచీ ధామ్ సమీపంలో

భారీ ట్రాఫిక్ జామ్!

- సుమారు 20 కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్
- రోడ్డుపై నిలిచిపోయిన వేలాది వాహనాలు

నైనితాల్, అక్టోబర్ 07(వెలుతురు): ఉత్తరాఖండ్ నైనితాల్ జిల్లాలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం కైంచీ ధామ్ వద్ద ఊహించని రీతిలో భారీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. నీమ్ కరోలీ బాబా ఆశ్రమ దర్శనం కోసం, ఇటీవల ప్రచారంలోకి వచ్చిన హనుమాన్ అంశ ప్రభావం వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు ఒకేసారి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భోవాలి-అల్మోడా రహదారిపై ఏకంగా 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కైంచీ ధామ్‌కు వెళ్లే ప్రధాన రహదారులన్నీ పర్యాటకుల కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలతో నిండిపోయాయి. గంటల తరబడి వాహనాలు అంగుళం కూడా ముందుకు కదలకుండా నిలిచిపోవడంతో పర్యాటకులు, చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొండ ప్రాంతం కావడంతో ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం, ఇరుకైన రహదారులు ఉండటం వల్ల సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. కైంచీ ధామ్ పీఠాధిపతి నీమ్ కరోలీ బాబాకు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు ఉన్నారు. సెలవు రోజులు లేదా ప్రత్యేక సందర్భాలలో ఇక్కడికి భక్తుల రాక విపరీతంగా పెరుగుతుంది. ఇటీవల సోషల్ మీడియా ప్రచారం, చిత్రాల ప్రభావం, ప్రముఖుల సందర్శనల వార్తల వల్ల యువత, పర్యాటకులు కైంచీ ధామ్ వైపు ఆకర్షితులవుతున్నారు. కొండ ప్రాంతాలలో పెరిగే వాహనాల సంఖ్యకు తగ్గట్లుగా పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడం వల్ల రహదారులపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. ట్రాఫిక్ సమాచారం అందుకున్న వెంటనే నైనితాల్ జిల్లా పోలీసులు, స్థానిక యంత్రాంగం రంగంలోకి దిగాయి. వాహనాలను క్రమబద్ధీకరించడానికి, ప్రత్యామ్నాయ పాయింట్ల వద్ద నిలిపివేయడానికి పోలీసులు గంటల తరబడి శ్రమించారు. రద్దీని నియంత్రించేందుకు కైంచీ ధామ్ మార్గంలో భారీ వాహనాల ప్రవేశంపై తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. కొండ ప్రాంతాలలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే ముందు ప్రయాణికులు ముందస్తుగా ట్రాఫిక్ అప్‌డేట్స్ తెలుసుకోవాలని, యంత్రాంగం జారీ చేసే మార్గదర్శకాలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఓటు హక్కు పరిరక్షకోసం

భారీ నిరసన ర్యాలీ

- ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల ఆందోళన
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం

గోదావరిఖని, వెలుతురు అక్టోబర్ 07 : ఓటు హక్కు పరిరక్షణ కోసం, ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 54వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి బుధవారం గోదావరిఖని ప్రధాన కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇండియా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓట్ల సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించే పరిస్థితులు తలెత్తకుండా ఎన్నికల సంఘం పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులు, తొలగింపులపై సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని స్పష్టం చేశారు. ఓటు హక్కు కేవలం ఎన్నికల్లో పాల్గొనే హక్కు మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, జవాబుదారీతనం ఉండాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి రాజకీయ జోక్యం, అన్యాయం లేదా అర్హులైన ఓటర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే ప్రజాస్వామ్య ప్రక్రియకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాల్సిందేనని నాయకులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తలెత్తుతున్న అనుమానాలు, అభ్యంతరాలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలైన సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు, గంగపుత్ర, ముదిరాజ్, యాదవ్, విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, మాల, మాదిగ, మైనారిటీ, గౌడ తదితర కుల సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇండియా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో బరితెగింపు పాలన నడుస్తోంది

- మాలిక్ చేతిలో సవారీల బతుకుల్లా మారాయి
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వ్యాఖ్యలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 07 : రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల బతుకులు 'పారడైజ్' సినిమాలో మాలిక్ చేతిలో సవారీల బతుకుల్లా మారాయని శాసన మండలి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణలో నీరో రాజ్యం కంటే దారుణ పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కేసీఆర్‌పై నిరంతరం విషం చిమ్ముతున్నారని, ఢిల్లీకి సూట్‌కేసులు, ప్రతిపక్షంపై కేసులు అన్నట్లుగా పాలన సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని, పోలీసులు ప్రతిపక్ష నేతల ఇళ్ల వద్ద బందీలుగా మారారని, కాంగ్రెస్ నేతల బౌన్సర్లలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల రిమాండ్‌ను కోర్టులు తిరస్కరిస్తున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో బారికేడ్లు ఎక్కి నిరసన చేస్తున్నా అక్కడ 'బడే భాయ్' మోదీ కేసులు పెట్టలేదని, ఇక్కడ 'చోటే భాయ్' కేడీ అరెస్టులు చేస్తున్నారని దేశపతి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. మెడికవర్ ఆస్పత్రి ముందు ఫ్లెక్సీలు పెడితే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ఫ్లెక్సీలు పెట్టిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. బ్యూరోక్రాట్ ఫిర్యాదు చేస్తే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. లిక్కర్ తయారీకి నీళ్ల కరువు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌పై వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదా, లేని రంకులు అంటగట్టి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టలేదా అని ప్రశ్నించారు. మూడేళ్లలో కాంగ్రెస్ చేసిన ఘనత శూన్యమని విమర్శించారు. ప్రజాస్వామ్యం ఏడో గ్యారెంటీ అని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు నిర్బంధాలు కొనసాగిస్తోందన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలన నడుస్తోందని కొంతమంది మేధావులు అన్నారని, కాంగ్రెస్ పాలనలో ఏమైనా పాలంకుశ పాలన నడుస్తోందా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి సమయం దగ్గరపడిందని దేశపతి శ్రీనివాస్ అన్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా, హోంమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నేపథ్యంలో పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న తన అనుయాయులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను రద్దు చేశారని ఆరోపించారు. ప్రజలకు రీకాల్ చేసే హక్కు ఉంటే ఈపాటికే రేవంత్ రెడ్డిని చెత్తబుట్టలో పడేసేవారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిని చరిత్ర చెత్తబుట్టలో వేయడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని దేవుడు ప్రసాదించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డి లాంటి ద్రోహుల వల్లే యువత బలిదానాలు జరిగాయని దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పేరు రాసి మరీ కొందరు ఆత్మాహుతి చేసుకున్నారని పేర్కొన్నారు. అమరుల గురించి మాట్లాడే నైతికత రేవంత్ రెడ్డికి ఎక్కడిదని ప్రశ్నించారు. అసైన్డ్ భూమిలో అమరవీరుల కాలనీ ఎందుకని ప్రశ్నించారు. అమరవీరులకు, దళితులకు తగాదా పెట్టవద్దని అన్నారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో, తాను అంటున్న ఫోర్త్ సిటీలో అమరుల కాలనీ కట్టాలని దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

సాక్షాత్తూ... ఆయన దైవ స్వరూపం!

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని ఢిల్లీలో 2019 జులై 27న కలుసుకున్నాను. అప్పటికి పది నెలల క్రితం జరిగిన భూటాన్ ఎన్నికల్లో నా పార్టీ ఓడిపోయి, పార్లమెంటులో ప్రాతినిధ్యం కోల్పోయింది. నేను ప్రధానమంత్రిని గానీ, ఎంపీని గానీ కాదు. కేవలం ఓ సాధారణ పౌరునిగా ప్రధాని మోదీతో సమావేశమయ్యాను. నేను అధికారంలో ఉన్న సమయంలో ఆయనిచ్చిన మద్దతుకి ధన్యవాదాలు తెలియజేశాను. వయసులో పెద్దవారైనందువల్ల మాత్రమే కాకుండా, సోదరునిగా నాకు ఆప్యాయతను పంచారు కాబట్టి ఆయన నాకు ఎప్పటికీ అన్నయ్యేనని చెప్పాను. ఆయన్ను నేను విష్ణు అవతారంగా భావిస్తానని కూడా ఆయనకు చెప్పాను. వివేకవంతులైన నాయకులను మన ప్రాంతంలో అలాగే పరిగణిస్తారని కూడా తెలియజేశాను. నా మాటలు నాకే ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆ తర్వాత అలా మాట్లాడటానికి కారణం ఏమై ఉంటుందని ఆలోచించాను. నేను ఉద్వేగానికి లోనయ్యానా? ఏమైనా తప్పుగా మాట్లాడానా? ఆ ఆలోచనలు కొనసాగాయి. సమాధానం స్పష్టంగా కనిపించింది. పీఎం మోదీని విష్ణు అవతారంగా నేను భావించడం సరైనదే. సుమారుగా 13 ఏళ్ల పాటు గుజరాత్ ప్రభుత్వాన్ని ఆయన నడిపించడం నేను చూశాను. ఆ సమయంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, అమలు తదితర అంశాల్లో ఆ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది. అనంతరం ఈ లక్ష్యాన్ని భారతదేశ స్థాయికి తీసుకెళ్లడం చూశాను. తయారీ రంగం, విదేశీ పెట్టుబడులు, ఆర్థిక సమ్మిళితత్వం, పారిశుద్ధ్యం, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలకు పునాదిగా సేవకూ, పంపిణీకీ ఆయనిచ్చిన ప్రాధాన్యం నిలిచింది. నేను ఆయనలోని ప్రజాసేవకుడిని కూడా గమనించాను. క్రమశిక్షణ, ఉత్సాహం, అసాధారణమైన కృషి ఆయనలో చూశాను. తన దేశానికి, ప్రజలకు సేవ చేయడంలో ఆయనకున్న అచంచలమైన అంకితభావం నన్ను ఆకట్టుకుంది. కానీ అంతకంటే ముఖ్యంగా, తమపై, తమ దేశంపై ఒక బలమైన నమ్మకాన్ని భారతీయుల్లో ఆయన మేల్కొల్పారు. వారు భారతదేశం పట్ల మరింత గర్వంగా, దాని అవకాశాల పట్ల మరింత ఆశాభావంతో, ప్రపంచంలో దాని స్థానం పట్ల మరింత విశ్వాసంతో కనిపిస్తున్నారు. భూటాన్ బౌద్ధ సంప్రదాయంలో సకల ప్రాణుల మోక్షానికి చెందిన బోధిసత్వుల త్రయమైన రిగ్సుమ్ గోన్పోను మేం పూజిస్తాం. జ్ఞానానికి మంజుశ్రీ, కరుణకు అవలోకితేశ్వర, ధైర్యానికి వజ్రపాణి ప్రతీకగా నిలుస్తారు. నా దృష్టిలో నిస్వార్థ సేవ ద్వారా జ్ఞానం,

కరుణ, ధైర్యం అనే ఈ మూడు గుణాలను ప్రదర్శించడమే వివేకవంతమైన నాయకత్వం. ఈ లక్షణాలన్నింటినీ పీఎం మోదీ దార్శనికత అయిన వికసిత్ భారత్లో అత్యంత స్పష్టంగా నేను చూస్తున్నాను. మెరుగైన భవిష్యత్తుకు సంబంధించిన స్పష్టమైన లక్ష్యంతోనే వివేకం మొదలవుతుంది. ఆయన 2047 నాటికి అంటే స్వాతంత్ర్యం సిద్ధించి శతాబ్ద కాలం పూర్తయ్యే సమయానికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని భారత్కు నిర్దేశించారు. ఆ లక్ష్యానికి వికసిత్ భారత్ అని పేరు పెట్టారు. గడువు నిర్దేశించి దానిని ఓ జాతీయ కార్యక్రమంగా మార్చారు. ఇతరుల ఆశలను, ఆకాంక్షలను అర్థం చేసుకోవడంతోనే కరుణ మొదలవుతుంది. బలమైన, సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన దేశం కోసం 140 కోట్ల మంది భారతీయుల ఉమ్మడి ఆకాంక్షను వికసిత్ భారత్ ప్రతిబింబిస్తుంది. అందరూ కలసి పురోగతి సాధించాలనే ఆకాంక్షను సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ ప్రతిబింబిస్తుంది. లక్ష్యాన్ని వాస్తవ రూపంలోకి మార్చాలనే సంకల్పంతోనే ధైర్యం వస్తుంది. మానవ వనరులను నిర్మించడం, పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక వసతులను ఆధునీకరించడం, అన్నింటి కంటే ముఖ్యంగా పరిపాలనను మెరుగుపరచడానికి కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలు చేయడం అవసరం. లక్ష్యం ఏర్పాటు చేసుకోవడం సులభమే. కానీ మార్పు తీసుకురావడం కష్టం. ఈ లక్షణాలన్నింటినీ నిస్వార్థమైన సేవ కలిపి ఉంచుతుంది. వికసిత్ భారత్ అనేది ఓ నాయకుడికో లేదా ఎన్నికలకు సంబంధించినదో కాదు. అది ఈ తరానికి, భవిష్యత్తు తరాలకు చెందినది. సబ్ కా ప్రయాస్ ద్వారా ప్రతి భారతీయుడు ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడమే కాకుండా.. దాని నిర్మాణంలో భాగం పంచుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. నిస్సందేహంగా ఇది ఆయన సాధించిన విజయాల్లో అతి ముఖ్యమైనది. ఆయన భారతదేశానికి ఓ గమ్యాన్ని నిర్దేశించడంతోనే సరిపెట్టుకోలేదు. ఆ దార్శనికతను విశ్వసించి, దానిని సాధించే దిశగా కృషి చేసేలా భారతీయుల్లో స్ఫూర్తి నింపారు. వికసిత్ భారత్ లక్ష్యం భారతదేశానికి మాత్రమే పరిమితం కాలేదు. భారత అనుసరిస్తున్న అంతర్జాతీయ విధానంలో పొరుగు దేశాలకు పీఎం మోదీ అత్యంత ప్రాధాన్యమిచ్చారు. గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను సమర్థించారు. వాయిస్ ఆఫ్ గ్లోబ్ సౌత్ సదస్సులను నిర్వహించారు. జీ20లో శాశ్వత సభ్యురాలిగా ఆఫ్రికన్ యూనియన్ను చేర్చడంలో ముఖ్య భూమిక పోషించారు. భారత్ ఎంత బలంగా తయారైతే.. అంత ఎక్కువ కృషి చేస్తుంది. అభివృద్ధి చెందిన భారత్ విస్తృతమైన మార్కెట్ను అందిస్తుంది. మరింత మూలధనాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకుంటుంది. ఈ ప్రాంత, గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను ప్రతిబింబించేలా ప్రపంచ అజెండాను రూపొందించడంలో ప్రభావాన్ని చూపుతుంది. ఇది నాకు వ్యక్తిగతంగా మరింత ముఖ్యమైనది.

వికసిత్ భారత్ అంటే వికసిత్ భూటాన్

2014 జూన్లో ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొన్ని వారాల్లోనే.. తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్ను పీఎం మోదీ ఎంచుకున్నారు. ఆ సమయంలో నేను ప్రధానిగా ఉన్నాను. ఆయనకు ఆతిథ్యం అందించే అదృష్టాన్ని పొందాను. ఈ పర్యటనలో మన సంబంధాలను మూడే అక్షరాల్లో ఆయన వివరించారు. బీ4బీ: భూటాన్ కోసం భారత్, భారత్ కోసం భూటాన్. ఈ వాక్యం సరళమైనదే కానీ, విస్తృతమైనది. గడచిన కొన్నేళ్లుగా ఆయన దాన్ని అనుసరిస్తూనే ఉన్నారు. మా ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు, మా 11వ పంచవర్ష ప్రణాళిక సమయంలో భారత్ అందించిన సాయం ఓ ప్రతిష్ఠాత్మకమైన అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేయడానికి దోహదపడింది. అందుకే మా 12వ ప్రణాళిక సమయంలోనూ ఈ ఉదార భాగస్వామ్యాన్ని పీఎం మోదీ కొనసాగించారు. నేను 2024లో మరోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు.. మా 13వ ప్రణాళికకు భారత్ అందించే సాయాన్ని రూ. 10,000 కోట్లకు రెట్టింపు చేశారు. ఇప్పుడు భూటాన్ వ్యాప్తంగా -- పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్తు, సాంకేతికత, వ్యవసాయం, వ్యాపారం అన్నింటా బీ4బీ ప్రభావం కనిపిస్తోంది. గెలెఫు మైండ్ఫుల్నెస్ సిటీని నిర్మించాలన్న మహారాజు లక్ష్యానికి భారత్ అందిస్తున్న సహకారంతో ఈ బీ4బీకి మరింత ప్రాధాన్యం పెరిగింది. భూటాన్కు పూర్తి సహకారం అందిస్తామని పీఎం మోదీ హామీ ఇచ్చారు. అది రైలు అనుసంధానం, విస్తృతమైన మౌలిక వసతులు, మెరుగైన విమాన, డిజిటల్ అనుసంధానంగా రూపుదిద్దుకుంటోంది. పీఎం మోదీ అందిస్తున్న మద్దతును భారతీయ వ్యాపార సంస్థలు స్ఫూర్తిగా తీసుకున్నాయి. టాటా పవర్, అదానీ గ్రూప్, జేఎస్డబ్ల్యూ ఎనర్జీ, ఇతర సంస్థలు భూటాన్లో పెట్టుబడులు పెడుతున్నాయి. అదే సమయంలో జీఎంసీలో వ్యవస్థాపక సభ్యులుగా ప్రముఖ భారతీయ వ్యాపారవేత్తలు చేరారు. భూటాన్ అత్యున్నత పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది డ్రక్ గ్యాల్పో'ను ప్రధాని మోదీకి మహారాజు ప్రదానం చేసినప్పుడు మా దేశ ప్రజలందరూ సంతోషించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి, ఏకైక విదేశీ నాయకుడు ఆయనే. వ్యక్తిగతంగానూ ఆయన ప్రభావం నాపై ఉంది. చాలా కాలంగా పీఎం మోదీని నా అన్నయ్యగా భావిస్తున్నాను. ఏళ్లు గడుస్తున్న కొద్దీ ఆయన్ను మార్గదర్శిగా చూడటం ప్రారంభించాను. ఆయన నాకెప్పుడూ సూచనలు ఇవ్వలేదు. ప్రజా సేవకుడిగా ఆయన ఆచరిస్తున్న విధానమే నాకు ఆదర్శంగా నిలిచింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. 2019లో జరిగిన సంభాషణ, దాని తర్వాత 2024 మార్చి 14న జరిగిన మా తదుపరి సమావేశం నాకు గుర్తుకొస్తున్నాయి. అప్పటికి నేను మళ్లీ ప్రధానిగా ఎన్నికయ్యాను. ఆయన్ను విష్ణు అవతారంగా చూస్తున్నానని చెప్పిన అయిదేళ్ల తర్వాత ఢిల్లీలో నా అన్నయ్యను కలుసుకున్నాను. అయిదేళ్ల కిందట నేను చెప్పిన దాని గురించి చాలాసేపు ఆలోచించానని, నేను తప్పు చేశానేమోనని సందేహించానని ఆయనకు చెప్పాను. నేను చెప్పిందే సరైనదని నిర్ణయానికి వచ్చాను. అదొక్కటే కాదు. ఏ అవతారమో కూడా ఇప్పుడు నాకు తెలిసింది. క్రమరాహిత్యాన్ని అధిగమించే, ధర్మాన్ని పునరుద్ధరించే, పునరుజ్జీవానికి నాంది పలికే విష్ణువు చివరి అవతారం.. కల్కి.

-శ్రీ షెరింగ్ తోబ్గే

జర్నలిస్టులకు
మార్గదర్శి కేశవ పిళ్ళై

అక్టోబర్ 8
పట్టు కేశవ పిళ్ళై జయంతి

దీవాన్ బహదూర్ పట్టు కేశవ పిళ్ళై (అక్టోబరు 8, 1860 – మార్చి 28, 1933) భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు. పట్టు కేశవపిళ్లే తమిళనాడు లోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో వేంకటా చలం, సుబ్బమ్మ దంపతులకు 1860, అక్టోబరు 8వ తేదీన జన్మించాడు. మద్రాసులో ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఆయన హిందూ పత్రికలో విలేఖరిగా తన వృత్తిని ఆరంభించాడు. అనంతపురం జిల్లా, గుత్తిలో కరెస్పాండెంటుగా ఆయన 1883లో తన 22వ యేట నియమించ బడ్డాడు. గుత్తిలో స్థిరపడటం వలన పట్టు కేశవ పిళ్లెను ప్రజలు "గుత్తి కేశవపిళ్లె"గా పిలువ సాగారు. 1893, అక్టోబర్ 4వ తేదీన బ్రిటిష్ సైనికుల అత్యాచారం నుండి యిద్దరు హిందూ మహిళలను రక్షించే క్రమంలో, గుత్తిలోని రైలుగేటు కీపర్ గూళిపాలెం హంపన్న ప్రాణాలొడ్డాడు. ఈ సంఘటనలో బ్రిటిష్ సైనికులు హంపన్నను కాల్చి చంపారు. ఆ సంఘటన గురించి గుత్తి కేశవపిళ్లే హిందూ పత్రికకు వార్త పంపగా అది ప్రముఖంగా ప్రచురింప బడింది. ఆ వృత్తాంత మంతా హిందూ పత్రికలో రావడంతో ఇంగ్లీషు వారు ఆంగ్లేయులకు ఏర్పరిచిన ప్రత్యేకమైన ప్రతిపత్తులతో కూడిన కోర్టులో విచారణ జరిపించారు. అప్పట్లో కేశవపిళ్లే గుత్తిలో సెకెండ్ గ్రేడ్ ప్లీడర్గా ప్రాక్టీసు చేసేవాడు. ఈ సంఘటన గురించి బ్రిటిష్ సైనికులకు వ్యతిరేకంగా వాదించాడు. అక్కడ ఉన్న జ్యూరీ వారిలో అధికభాగం ఆంగ్లేయులు, మిగిలిన కొందరు వారిపై జీవనము ఆధారపడిన దుబాసీలు. కోర్టులో ఆ స్త్రీలు వ్యభిచారులని, హంపన్న వ్యభిచరింప జేసే వ్యాపారియని వ్యభిచారం విషయంలో డబ్బు ఎక్కువ తక్కువల్లో తమను కొట్టవచ్చాడని, ఆత్మరక్షణార్థం తాము కాల్చామని వాదించారు. వాదనలు నడుస్తూండగానే ఈ కేసుకు వ్యతిరేకంగా హిందూ పత్రికలో చాలా వార్తలు, అభిప్రాయాలు వచ్చాయి. చివరకు ఈ కేసులో వ్యభిచార వ్యవహారంలో తేడా రావడంతోనే ఈ ఘటన జరిగిందని, హంపన్న అమాయకుడేమీ కాదన్న వ్యాఖ్యలు చేస్తూ ఈ నేపథ్యంలో ఆంగ్ల సైనికుల దోషం ఏమీ లేదని తేల్చి, నిర్దోషులుగా విడిచి పెట్టాయి. ఇది జాత్యహంకారానికి ఉదాహరణ అంటూ హిందూ దినపత్రిక తీవ్రంగా ఖండించింది. స్థానికులు వీరుడైన హంపన్నపై ఇటువంటి ఘోరారోపణ చేయడాన్ని సహించలేక ఓ స్మారక చిహ్నం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనికి హిందూ పత్రిక సహకరించి, తమ పత్రిక ద్వారా విరాళాల కోసం ప్రయత్నాలు సాగించింది. గ్రామస్థులు, హిందూ

పత్రికవారూ విరాళాలిచ్చిన దాతల సహకారంతో హంపన్న స్మారక చిహ్నాన్ని నిర్మించారు. స్మారక సంఘం వారు స్మారక చిహ్నం నిర్మాణానికి తొమ్మిది చదరపు టడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి, దానిపై ఏడడుగుల ఎత్తుగల రాతిస్తంభం నిలబెట్టి, దానికి ఓ స్మారక ఫలకాన్ని వ్రాయించి పెట్టారు. చుట్టూ ఆవరణ గోడ కూడా కట్టించారు. ఆ శిలాఫలకంపై ఆంగ్లంలో ఈ క్రింది విధంగా చెక్కారు. స్మారకచిహ్నం ఏర్పాటు, తమకు అవమాన కరమని కొందరు బ్రిటీష్ అధికారులకు తోచి, స్థల విక్రయం రద్దుచేయాలని ప్రయత్నించారు. కాని వ్రాయించిన దస్తావేజు విస్పష్టముగా నుండడం, దానిలో కూడా స్థలం కొనుగోలు స్మారక చిహ్నం నెలకొల్పేందుకే నన్న సంగతి వ్రాసి వుండడం కారణాలతో ఏమీ చేయలేక పోయారు. డిప్యూటీ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ అయిన లెగ్గట్ ఈ స్మారక చిహ్నాన్ని చూసి చాలా ఆగ్రహించారు. దీనిని ఎలాగైనా తొలగించాలని సిఫారసు చేస్తూ చెన్నపట్టణ ప్రభుత్వం వారికి వ్రాశారు. గుత్తి విలేఖరి యైన కేశవపిళ్లేపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని ప్రయత్నాలు చేశారు. ఐతే ఇవేవీ జరగలేదు. మద్రాసు గవర్నర్ వెన్లక్ ప్రభుత్వం హంపన్న స్మారక చిహ్నం ఏమీ చేయరాదన్న ఉత్తర్వు చేసింది. ఈ సంఘటనతో హంపన్నతో పాటుగా గుత్తి కేశవపిళ్లే కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాడు. హంపన్న వృత్తాంతంతో ఆయనను స్థానిక ప్రభుత్వం గుర్తించి అనంతపురం, కర్నూలు, బళ్ళారి జిల్లాలకు జిల్లా బోర్డు సభ్యుడిని చేసింది. 1916–17లో ఇతడు కాంగ్రెస్ సభ్యునిగా చురుగ్గా పని చేశాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా ఎన్నుకో బడ్డాడు. ఆయన గుత్తి తాలూకా బోర్డు ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. మద్రాసు ఫారె–స్ట్ సభ్యుడిగా సేవలను అందించాడు. శ్రీలంకలోని భారతీయ వర్తకుల కోరిక మేరకు అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను సమర్పించాడు. 1885లో బొంబాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ప్రథమ మహాసభకు అయన హాజరయ్యాడు

-రామ కిష్టయ్య సంగన భట్ల,
జర్నలిస్టులకు మార్గదర్శి కేశవ పిళ్ళై

గతి తప్పుతున్న
మానవ సంబంధాలు

-వంశీ కృష్ణ గౌడ్
సీనియర్ జర్నలిస్టు

ప్రతి ఒక్క జీవి అమ్మ కడుపులో నుండి భూమిని చేరిన తర్వాత బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం అనే వివిధ దశలతో తన జీవిత ప్రయాణాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. ఈ జీవిత ప్రయాణంలో బంధాలు, బాధ్యతలు ప్రేమలు ,వ్యక్తిత్వం నిర్మాణం ,డబ్బు ఇలా అనేక రకాల అంశాలు ఎదురుపడి నీకు బతుకు అంటే ఏంటో నేర్పిస్తాయి. ప్రతి మనిషి జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తి మరియు ప్రతి పరిస్థితి ఏదో ఒక తెలియని విషయాన్ని నేర్పించడానికి ప్రతిక్షణం ప్రయత్నిస్తాయి. ఆ నేర్పించిన విషయాన్ని గుణపాఠంగా భావించిన వ్యక్తి బతుకు భవిత బాట పడుతుంది. కానీ నేటి మానవ సమాజం అందుకు భిన్నంగా ముందుకు సాగుతుందని మేధావులు అభిప్రాయం. ఎదురయ్యే పరిస్థితులు వాటి వల్ల జరిగే పరిణామాలతో సంబంధం లేకుండా వ్యక్తిగత స్వేచ్ఛకు బానిసై అనేక విశృంఖల మైన ఆలోచనలతో విజృంభిస్తున్నారు. ప్రతి ఒక్కరికి వ్యక్తిగత స్వేచ్ఛ ఉండాలి కానీ అది ఆ వ్యక్తి చుట్టూ ఉన్న పరిస్థితులను కానీ ఆ వ్యక్తి ఉన్న సమాజాన్ని కానీ ప్రభావితం చేసి పాడు చేయకుండా ఉండాలి. మానవ సమాజంలో నివసిస్తున్నామనే ఇంగిత జ్ఞానం కరువు అవడం నేటి సభ్య సమాజం యొక్క దుస్థితి. చిన్న ,పెద్ద ముసలి ,ముతక ఇలా సంబంధం లేకుండా ఎవరికి వారు వ్యక్తిగత ఆలోచనలతో ఎంతటి పనికైనా, అది ఎలాంటి విషమ పరిస్థితులకు దారి తీసిన భయపడకుండా బాధ్యతను మరిచి ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి విషమించిన పరిస్థితులకు గల కారణాలు అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక విశ్లేషకుల ఆలోచన. తల్లిదండ్రులకు తమ పిల్లలపై సరియైన శ్రద్ధ, అలవాట్ల పై దృష్టి సారింపు లేకపోవడం, మితిమీరిన ఖర్చులకు సంబంధించిన ఆర్థిక సర్దుబాటు ఇలాంటి విషయాల పట్ల ఆలోచనలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల పిల్లల వ్యక్తిత్వ నిర్మాణం భిన్నంగా మారి చెడు అలవాట్ల బాట పడుతున్నారు ఇది క్రమక్రమంగా ఎన్నో దారుణాలకు దారి తీయడం మనందరం ప్రతిరోజు ఏదో ఒక సంఘటన రూపంలో చూస్తూనే ఉన్నాం. పిల్లల పెంపకం, వాళ్ల వ్యక్తిత్వ నిర్మాణం, పిల్లల ఆలోచన విధానం అనేది వారి జీవిత ప్రయాణంలో ఎదురయ్యే మానవ సంబంధాలపై ప్రభావం చూపడం సర్వసా ధారణం కావున తల్లిదండ్రులు పిల్లల పెంపకం వారి ప్రవర్తన, అభిరుచులు, అలవాట్లు వాళ్లు చేసే స్నేహాల పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి. ఏమాత్రం అశ్రద్ధ వహించిన పిల్లల భవిష్యత్తు అంధకారం అవడంతో పాటు మానవ సమాజపు విలువలను కాలరాసే పనులు చేయడం వారి ప్రవృత్తిగా మారడం జరుగు తుందనే వాస్తవం. నేటి 21 శతాబ్ద కాలంలో మానవ సంబంధాలు చాలా వరకు గతితప్పియ నడంలో ఎలాంటి సందేహం లేదు మానవ సంబంధాల మధ్య స్పష్టత లోపించి ఎవరికి నచ్చినట్టు వారి విధానాలతో, ఆలోచనలతో, విలువలకు తిలోద్దకాలు ఇస్తున్నారు. భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడం, ఒకరిని ఒకరు పూర్తిస్థాయిలో అర్థం చేసుకునే అవగాహన లేకపో వడం వల్ల కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. ఇరువురు ఒకరి పట్ల ఒకరికి నమ్మకం కోల్పోయి కుటుంబాల భవిష్యత్తును బజారు పాలు చేసుకుం టున్నారు. ఒకరికి ఒకరు కుటుంబంతో సమయం కేటాయించకపోవడంతో వల్ల మనస్పర్థలు మొదలయి తున్నాయి అవి క్రమంగా వేరేలా రూపాం తరం చెంది కుటుంబ వ్యవస్థను వ్యవస్థ కూలిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విపరీతమైన సోషల్ మీడియా వినియోగం అరచేతిలో ప్రపంచాన్ని చూసే స్మార్ట్ ఫోన్ ఉపయోగించడం కూడా మానవ సంబంధాలను అతిగా ప్రభావితం చేస్తున్నాయి. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో సంబంధాలు వివాహేతర సంబం ధాలకు దారి తీస్తున్నాయి. అవి చివరికి కుటుంబంలో దారుణాలు జరగడానికి కారణాలుగా మారుతున్నా యి. భర్తలను చంపడం లేదా హత్య చేయించడం లేదా భార్యలను, కన్న పిల్లలను చంపడం ఇలా కొన్ని సంఘటనలు చూస్తుంటే నేటి మానవ సమాజ పయనం ఎటువైపు వెళుతుందని ఆశ్చర్యం కలుగు తుంది. క్షణికమైన సుఖం కోసం నిండు నూరేళ్ల జీవితా లను ఆ అభాసుపాలు చేసుకుంటున్న మనుషులు నేటి సమాజంలో అనేకమంది ఉన్నారు. కుటుంబం, బాధ్యతలు, పిల్లలు, ఉన్నతంగా సమాజంలో జీవించడం అనే అనేక విషయాలను పక్కనపెట్టి కొంతమంది మహిళలు, పురుషులు స్వతంత్రంగా వారికి నచ్చిన విధంగా ఉండడానికి ఇష్టపడుతూ వారిని నమ్మి ఉన్న పిల్లల భవిష్యత్తును బలి చేస్తున్నారు ఇలా ఒక్కటేమిటి ఏది చూసినా దాని అంతిమ లక్ష్యం మానవత విలువలను బలమైన మానవ సంబంధాలను దెబ్బతీసేలా ఉండడం నేటి సమాజం యొక్క దురదృష్టం. స్నేహం ముసుగులో నమ్మిన వ్యక్తిని మోసం చేయడం, అదే మోసాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం లేదా హత్య చేయడం, కన్న తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో వారి యోగక్షేమాలు చూసుకోకుండా అనాధాశ్రమాలకు పంపడం, తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులకు ఆశపడి వారిని నిర్లక్ష్యం చేయడం కొన్ని సంఘటనలు మరీ హేయనీయంగా ఉన్నాయి. ఆస్తుల వాటాల కోసం తల్లిదండ్రుల అంతిమ సంస్కారాలు చేయలేని ప్రబుద్ధులు ఉన్న మానవ సమాజంలో ఉన్నామంటే అసహ్యం వేసే పరిస్థితి దాపురించింది. స్వార్థపూరిత ఆలోచనలతో ఎదుటి వ్యక్తిని మోసం చేయడమే పనిగా పెట్టుకున్న వ్యక్తులు సంఖ్య కూడా పెరిగిపోయింది నిస్వార్థం, దయాగుణం సహాయపడడం మానవత్వంతో కూడిన ఆలోచనలు ప్రేమ, పాపం, పుణ్యం ఇలా కొన్ని అతిసాధారణమైన మానవతా విలువలను పాత్ర వేసి రాక్షసపు ఆలోచనలతో ఉన్న సభ్య సమాజం నేడు రాజ్యమేలుతుంది. ఏది ఏమైనా గతి తప్పిన మానవ సంబంధాల ప్రయాణం ఈ మానవ సమాజానికి ఒక మాయని మచ్చగా మారడం బాధాకరం.

బిడ్డలను కాపాడాల్సిన ఆసుపత్రే..
మృత్యువుకు ద్వారమైతే ఎట్లా...!

-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ఒక బిడ్డ పుట్టిన క్షణం ఆ కుటుంబానికి కొత్త జీవితానికి ఆరంభం. నెలల తరబడి ఎదురు చూసిన తల్లిదండ్రులు తమ బిడ్డను తొలిసారి చూసినప్పుడు భవిష్యత్తుపై ఎన్నో కలలు కంటారు. ఆ చిన్నారి ఎదుగుదలను చూడాలని, తమ కళ్ల ముందే నడవాలని, చదువుకోవాలని, జీవితంలో స్థిరపడాలని ఆశిస్తారు. కానీ ఆ ఆశలన్నీ ఆసుపత్రి గోడల మధ్యే ఆవిరైపోతే ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం కూడా కష్టం. ఆదిలాబాద్ రిమ్స్లో నవజాత శిశువుల విభాగంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఈ విషాదాన్ని మరోసారి మన కళ్ల ముందుంచింది. అప్పుడే పుట్టి వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సిన పసికందులు ప్రాణాలు కోల్పోవడం ఒక ప్రమాదం మాత్రమే కాదు.. ఆసుపత్రి భద్రత, నిర్వహణ, అత్యవసర సన్నద్ధత, అధికారుల పర్యవేక్షణ వంటి అనేక అంశాలను ప్రశ్నార్థకం చేస్తున్న ఘటన. రిమ్స్లోని నవజాత శిశువుల విభాగంలో అగ్ని ప్రమాదానికి విద్యుత్ పరికరం లేదా ఏసీ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం కారణమై ఉండొచ్చన్న అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అయితే అసలు కారణం ఏదైనా కావచ్చు..

ఒక పరికరంలో ఏర్పడిన లోపం ఇంతటి ప్రాణనష్టానికి దారితీయకుండా నిరోధించాల్సిన బాధ్యత మాత్రం ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థపైనే ఉంటుంది. పరికరాలు ఎప్పుడు తనిఖీ చేయబడ్డాయి? విద్యుత్ వ్యవస్థకు భద్రతా పరీక్షలు జరిగాయా? అగ్నిమాపక పరికరాలు పనిచేసే స్థితిలో ఉన్నాయా? అత్యవసర పరిస్థితుల్లో శిశువులను తరలించేందుకు ముందస్తు ప్రణాళిక ఉందా? సిబ్బందికి శిక్షణ ఇచ్చారా? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. నవజాత శిశువుల విభాగం సాధారణ వార్డు కాదు. అక్కడ చికిత్స పొందుతున్న పిల్లలు స్వయంగా కదలలేరు. కొందరు ఇంక్యుబేటర్లు, ఆక్సిజన్ సరఫరా, ఇతర వైద్య పరికరాలపై ఆధారపడి ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో మంటలు చెలరేగినా, పొగ వ్యాపించినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా వారిని క్షణాల్లో సురక్షిత ప్రాంతానికి తరలించడం అత్యంత క్లిష్టమైన పని. అందుకే ఈ విభాగాల్లో భద్రతా ప్రమాణాలు సాధారణ ఆసుపత్రి ప్రమాణాల కంటే మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒకవైపు పసికందుల ప్రాణాలను కాపాడేందుకు వైద్య సిబ్బంది పోరాడుతుండగా, మరోవైపు భవనం, విద్యుత్, అగ్నిమాపక వ్యవస్థలు కూడా అదే స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ ఆసుపత్రులు సామాన్య ప్రజలకు ప్రాణాధారం. ప్రైవేటు వైద్య సేవల ఖర్చులను భరించలేని కుటుంబాలు ప్రభుత్వ ఆసుపత్రులనే ఆశ్రయిస్తాయి. ముఖ్యంగా ప్రసూతి సేవలు, నవజాత శిశు సంరక్షణ, అత్యవసర వైద్యం వంటి విభాగాల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే కుటుంబాల సంఖ్య పెద్దది. అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రతా లోపం ఏర్పడితే దాని ప్రభావం ఒక్క కుటుంబానికే పరిమితం కాదు. ప్రజల ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ఉన్న నమ్మకాన్నే అది దెబ్బతీస్తుంది. వైద్య సదుపాయాలు పెంచడం ఎంత అవసరమో వాటి నిర్వహణ కూడా అంతే ముఖ్యం. కోట్ల రూపాయల విలువైన యంత్రాలను కొనుగోలు చేసి, ఆధునిక వార్డులను ఏర్పాటు చేసి, పడకల సంఖ్య పెంచడం ద్వారా మాత్రమే ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలపడదు. ఆ పరికరాలు నిరంతరం పనిచేసే స్థితిలో ఉన్నాయా? వాటికి కాలానుగుణ నిర్వహణ జరుగుతోందా? సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉన్నారా? విద్యుత్ వైరింగ్ పాతబడిందా? అగ్నిమాపక పరికరాల గడువు ముగిసిందా? అత్యవసర ద్వారాలు, మార్గాలు అందుబాటులో ఉన్నాయా? వంటి అంశాలను కూడా నిరంతరం పర్యవేక్షించాలి. నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం ఒక్కోసారి పెద్ద విషాదానికి దారితీయగలదనే విషయాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది. సిబ్బంది కొరత, ఆసుపత్రి నిర్వహణలోని ఇతర లోపాలు కూడా ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది సంఖ్య తగినంతగా లేకపోతే అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందన వేగం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రమాదం జరిగిన ప్రతిసారీ మొత్తం బాధ్యతను ఒక్క సిబ్బందిపైనే మోపడం కూడా సరైన విధానం కాదు. వ్యవస్థలో ఎక్కడ లోపం ఏర్పడింది, ఎవరి బాధ్యత ఏ స్థాయిలో ఉంది, ముందుగా ఏ హెచ్చరికలు లేదా ఫిర్యాదులు వచ్చాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి. వ్యక్తిగత తప్పిదం ఉంటే అది వేరుగా, నిర్వహణపరమైన వైఫల్యం ఉంటే అది వేరుగా గుర్తించాలి. ప్రమాదం జరిగిన తర్వాత విచారణ కమిటీలు వేయడం పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ విచారణ నివేదికలు ఫైళ్లకే పరిమితమైతే వాటి ప్రయోజనం ఉండదు. ప్రమాదానికి తక్షణ కారణాన్ని గుర్తించడంతో పాటు, దానికి దారితీసిన పరిస్థితులను కూడా పరిశీలించాలి. ఉదాహరణకు పరికరానికి నిర్వహణ అవసరమని ముందే గుర్తించారా? భద్రతా తనిఖీలో లోపాలు బయటపడ్డాయా? వాటిని సరిచేయడానికి నిధులు లేదా సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉన్నారా? ఉంటే చర్య ఎందుకు తీసుకోలేదు? లేకుంటే సంబంధిత అధికారులకు సమాచారం చేరిందా? ఇలాంటి ప్రశ్నలన్నింటికీ ఆధారాలతో సమాధానాలు రావాలి. అప్పుడు మాత్రమే బాధ్యత ఎవరిది అన్నది స్పష్టమవుతుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రసూతి విభాగాలు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు, ఐసీయూలు, ఆక్సిజన్ ఆధారిత వార్డులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. అగ్నిమాపక పరికరాలు పనిచేస్తున్నాయా లేదా అన్నదాన్ని కాగితాలపై కాకుండా ప్రత్యక్షంగా పరీక్షించాలి. విద్యుత్ వైరింగ్, ఏసీ యంత్రాలు, జనరేటర్లు, ఆక్సిజన్ లైన్లు, అత్యవసర అలారాలు వంటి వ్యవస్థలను నిర్దిష్ట వ్యవధిలో తనిఖీ చేయాలి. ప్రమాద సమయంలో రోగులను ఎలా తరలించాలన్న దానిపై సిబ్బందికి క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలి. ఒకసారి శిక్షణ ఇచ్చి మరిచిపోవడం కాకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని పరీక్షించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య, నర్సింగ్, సాంకేతిక, నిర్వహణ సిబ్బంది పోస్టులను భర్తీ చేయడం కూడా అవసరం. వైద్యుడు, నర్సు మాత్రమే ఆసుపత్రిని నడపరు. విద్యుత్ వ్యవస్థను చూసే సాంకేతిక నిపుణుడు, వైద్య పరికరాలను నిర్వహించే బయోమెడికల్ ఇంజినీర్, అగ్నిమాపక భద్రతను పర్యవేక్షించే సిబ్బంది, నిర్వహణ సిబ్బంది కూడా ఆసుపత్రి భద్రతలో కీలక పాత్ర పోషిస్తారు. ఈ వ్యవస్థలో ఏ ఒక్క భాగం బలహీనపడినా దాని ప్రభావం మొత్తం ఆసుపత్రిపై పడుతుంది. అన్నింటికంటే ముఖ్యమైనది బాధ్యత నిర్ధారణ. నిర్లక్ష్యం జరిగినట్లు విచారణలో తేలితే, ఆ నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై నిబంధనల ప్రకారం తగిన పరిపాలనా చర్యలు తీసుకోవాలి. వాస్తవాలు, రికార్డులు, తనిఖీ నివేదికలు, విధి నిర్వహణ వివరాలు, సాంకేతిక నివేదికల ఆధారంగా బాధ్యతను నిర్ణయించాలి. తప్పిదం ఎక్కడ జరిగిందో స్పష్టంగా గుర్తించి, అదే లోపం మరో ఆసుపత్రిలో పునరావృతం కాకుండా వ్యవస్థాత్మక మార్పులు చేయాలి. ఈ విషాదంలో తమ బిడ్డలను కోల్పోయిన కుటుంబాలకు ఏ పరిహారమూ జరిగిన నష్టాన్ని భర్తీ చేయలేదు. డబ్బుతో బిడ్డను తిరిగి తీసుకురాలేం. అయినప్పటికీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు తగిన ఎక్స్గ్రేషియాను ప్రకటించి, తక్షణ ఆర్థిక సహాయం అందించడం కనీస మానవతా బాధ్యతగా పరిగణించవచ్చు. బాధిత కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పరిహారం అందించడంతో పాటు, అవసరమైన ఇతర ప్రభుత్వ సహాయాన్ని కూడా అందించాలి. వారి వేదనను కేవలం ఒక అధికారిక ప్రకటనతో ముగించకుండా, బాధిత కుటుంబాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలి. చివరికి ఈ ఘటనను ఒక వార్తగా మాత్రమే మిగలనివ్వకూడదు. మృతుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా, సమగ్ర విచారణ, బాధ్యత నిర్ధారణ, నిర్లక్ష్యం రుజువైతే సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల భద్రతా ఆడిట్, లోపాల సత్వర పరిష్కారం, అవసరమైన సిబ్బంది నియామకం, అత్యవసర తరలింపు శిక్షణ, పరికరాల నిరంతర నిర్వహణ వంటి చర్యలు ఒక సమగ్ర కార్యాచరణలో భాగం కావాలి. ప్రభుత్వం ఈ చర్యలకు గడువులు నిర్ణయించి, అమలు పురోగతిని ప్రజలకు తెలియజేయడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చు. పుట్టిన కొన్ని గంటల్లోనే ప్రాణాలు కోల్పోయిన ఆ పసికందులు తిరిగి రావు. వారి తల్లిదండ్రుల జీవితాల్లో ఏర్పడిన అంధకారాన్ని ఏ వెలుగూ పూర్తిగా తొలగించలేదు. కానీ ఆ చిన్నారుల మరణం నుంచి వ్యవస్థ ఒక పాఠం నేర్చుకోవచ్చు. ఆసుపత్రిలో వైద్యం అందించడం మాత్రమే కాదు, రోగిని సురక్షితంగా కాపాడటం కూడా ప్రభుత్వ వైద్య వ్యవస్థ బాధ్యత. ఒక పరికరం లోపం ప్రాణాంతక ప్రమాదంగా మారకుండా ముందే గుర్తించడం, ఒక మంట విపత్తుగా మారకముందే ఆర్పివేయడం, ఒక శిశువును ప్రమాదం నుంచి క్షణాల్లో బయటకు తీసుకురావడానికి సిద్ధంగా ఉండటం---ఇవే ప్రజా ఆరోగ్య వ్యవస్థకు అసలైన పరీక్షలు. ఆ పరీక్షలో ఇకపై ఒక్క నిర్లక్ష్యానికి కూడా చోటుండకూడదు. బాధిత కుటుంబాలకు న్యాయం, వ్యవస్థలో బాధ్యత, ఆసుపత్రుల్లో భద్రత---ఈ మూడు కలిసినప్పుడే ఆ విషాదానికి అర్థవంతమైన ముగింపు లభిస్తుంది. లేకపోతే ఈ ప్రభుత్వంపై ప్రజలకు ప్రభుత్వ హాస్పిటల్ పై నమ్మకం పోతుందనేది గుర్తెగాల్సిన అవసరం ఉంది.

ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన ఆరుట్ల గ్రామసర్పంచ్, పాలక మండలి సభ్యులు

- విద్యార్థులు భోజనం చేసే పాత్రలు శుభ్రత పాటించాలి నాణ్యమైన ఆహారం అందించాలి
- గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్

మంచాల వెలుతురు అక్టోబర్ 07: మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ పాలకమండలి స భ్యులు పాఠశాలలోని క్లాసుల గదుల్లోకివెళ్లి ఉపాధ్యాయులు విద్యాబోధన ఎలాచేస్తున్నారు అ ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అనంతరం మధ్యాహ్నం భోజనం సమయంలో

భోజన శాల దగ్గరికి వెళ్లి గ్రామసర్పంచ్ ఉపసర్పంచ్ పాలకమండలి సభ్యులు విద్యార్థులతో కలిసి కూ ర్చొని విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ భోజనం చేశారు ఈసందర్భంగా గ్రామసర్పంచ్ మాలిపాటి శోభకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థులుభోజనం చేసే గ్లాసులు పాత్రలు శుభ్రంగా కడిగి పరిశుభ్రత పాటించాలి అన్నారు విద్యార్థులకు నాణ్యమై న ఆహారాన్ని అందించాలి అనిఅన్నారు కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కొండి గారి శ్రావణ్ కుమార్ మంకు మమత వినోద్ మంద మాధవి. మోహన్ రెడ్డి పున్నం రాముమాడు గుల బాలమని కృష్ణ గౌడ్ లాలగారి మణెమ్మ సాతిరి సత్యం ప్రజాగలం దామర భూపాల్ తదిత రులు పాల్గొన్నారు

త్రోబాల్ సెలెక్షన్స్ ట్రయల్స్ లో ఎంపికైన సాక్రెడ్ హార్ట్ హైస్కూల్ విద్యార్థులు.

మోత్కూర్, అక్టోబర్ 7,వెలుతురు న్యూస్ : హైదరాబాద్ లోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నాడు తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ వారు నిర్వహించిన త్రోబాల్ సెలెక్షన్స్ ట్రయల్స్ లో మోత్కూర్ మున్సిపాలిటీలోని సేక్రెడ్ హార్ట్ హై స్కూల్ విద్యార్థులు 0. శివస్వామి , చీ. సూర్య ,ు. పల్లవి సబ్ జూనియర్ విభాగం నుండి రాష్ట్ర స్థాయి లో ఎంపికైనట్లు జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జూ. పూర్ణ చందర్ రాజు మోత్కూర్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫాథర్ తానయ్య ఎంపికైనా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ అమల ఒ పి . ఇ . టి వీణ. చాంద్ పాషా తోటి ఉపాధ్యాయులు అభినందించారు. సెలక్షన్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30, 31, నవంబర్ 1 తేదీలలో వెస్ట్ బెంగాల్లో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలలో పాల్గొంటారని మోత్కూర్ యాదయ్య తెలిపారు.

వైద్యం అందక లేగదూడ మృతి

పశువైద్యాధికారి నిర్లక్ష్యంపై రైతు ఆగ్రహం

శంకర్పల్లి, వెలుతురు నవంబర్ 07 : రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలం సంకేపల్లి గ్రామంలో పశువైద్యాధికారి నిర్లక్ష్యం కారణంగా ఒక చిన్న లేగదూడ మృత్యువాత పడింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంకేపల్లి గ్రామానికి చెందిన ఒక రైతుకు ఉన్న గేదె 15 రోజుల క్రితం ఒక లేగదూడకు జన్మనిచ్చింది. కొన్ని రోజుల పాటు ఆరోగ్యంగానే ఉన్న ఆ చిన్న గేదె దూడ, గత నాలుగు ఐదు రోజుల నుండి తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీనిపై సదరు రైతు సంబంధిత పశువైద్య అధికారులకు సమాచారం అందించగా, ఒకరోజు వచ్చి నామమాత్రంగా చికిత్స చేసి వెళ్లారు. ఆ తర్వాత కూడా దూడ ఆరోగ్యం క్షీణించడంతో రైతు ఆందోళన చెందాడు. సంకేపల్లి గ్రామంలో పశు వుల ఆసుపత్రి లేకపోవడంతో, పక్కనే ఉన్న పర్వేద గ్రామంలోని పశువుల దవఖానా వైద్యుడికి రైతు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించాడు. అయితే సదరు డాక్టర్ ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో, సమయానికి సరైన వైద్యం అందక నవంబర్ 06న ఆ చిన్న లేగదూడ మరణించింది. లక్షల రూపాయల విలువ చేసే పశువుల ప్రాణాలంటే అధికారులకు అంత నిర్లక్ష్యమా అని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహించిన సదరు పశువైద్యాధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంకేపల్లి పరిసర ప్రాంతాల్లో పశు వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన బిఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేయాలి

- మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్మనరేందర్ రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవ ర్గం నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

మంచాల వెలుతురు అక్టోబర్ 07: మంచాల మండలం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన బిఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎద్మనరేందర్ రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయ కుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మంచాల పోలీస్ స్టేషన్ కు వెళ్లి మంచాల సీఐ మధుకు ఫిర్యాదు చేశారు ఈసందర్భంగా నాయకులు మాట్లాడు తూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రంగారెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ హాలక్ష్మి ఉచిత బస్సుప్రయాణం ఎలాగుందో తెలుసుకోవడానికి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ప ర్టీ శ్రేణులు మీడియా మిత్రులతో కలిసి బస్సుఎక్కి ప్రయాణికులతో ముచ్చటిస్తూ సమ స్యలు తెలుసు కుంటూ ఇంజాపూర్ వరకు బస్సు ప్రయాణం చేశారు బస్సులో ప్రయాణం చేసే టప్పుడు ఒక బిడ్డ లాంటి మహిళతో చెయ్యి కలిపి ముచ్చటిస్తున్న సమయంలో వీడియోతీసిన పోకిరీలు దాన్ని తప్పుగా కావాలని పట్టుకున్నాడు అని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు అని అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మల్ రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులుచూ సి ఓర్వలేకనే కొంతమంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలని సోషల్ మీడియాలోఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి రెడ్డిగారిపై దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అని అన్నారు ఇప్ప టికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇలాంటి ప్రచారాలు చేయడం మానుకోవాలి లేని పక్షంలో రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్తాం అని హెచ్చరించారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అ ధికార ప్రతినిధి బైరక రమాకాంత్ రెడ్డి చీమల జంగయ్య యాదవ్ ఆరుట్ల మాజీసర్పంచ్ ఆనం గళ్ళ యాదయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పుల వినయ్ పాలకుర్ల శేఖర్ గౌడ్ నేనావత్ రా జునాయక్ సర్పంచ్ లు నేనావత్ బాలునాయక్ చంటి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ రఘు పగడాల శ్రీశైలం రాజ్ కుమార్ నాయక్ నూకం శేఖర్ ముదిరాజ్ లాలూ నాయక్ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

నూతనంగా ఎన్నికైన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు ఘన సన్మానం.

మోత్కూర్, అక్టోబర్ 7,వెలుతురు న్యూస్ : తెలంగాణ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికైన డా. గుర్రం లక్ష్మీనరసింహ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన చొల్లేటి నరసింహ చారి, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి లను మోత్కూరు పద్మశాలి కుల బాంధవులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీలో మోత్కూరు తరపున జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఉండడం మన ఊరుకు గర్వకారణం అని కొనియాడారు. కార్యక్రమంలో పోచం బిక్షపతి , వేముల నారాయణ , జిల్లా రవీందర్ , మంచె గోవర్ధన్ , చిట్టిప్రోలు శంభులింగం , పగడాల లక్ష్మి నర్సు , ఏలూరు మచ్చగిరి , మహేశ్వరం శ్రీనివాస్ , పసునూరి సురేష్ , ఎలగందుల అమరేందర్ తదితర పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి అక్టోబర్ 07 వెలుతురు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఎల్ చెరువును సందర్శించిన ఎమ్మెల్యే, బతుకమ్మ వేడుకల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు, ఆడపడుచులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణ, పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి సౌకర్యం, మహిళలకు అవసరమైన ఇతర వసతులను సమకూర్చాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేసి బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో బతుకమ్మ వేడుకలు నిర్వహించే సున్నం చెరువు, కాముని చెరువు, ఐడీఎల్ చెరువు, బోయిన్ చెరువు, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించి, ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. "తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మన ఆడపడుచులందరూ ఆనందంగా, ఘనంగా జరుపుకోవాలి. ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, ఆడపడుచులందరికీ ఎమ్మెల్యే బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబూరావు, ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, మాధవరం రంగారావు, తులసిరావు, ఆనందరావు, నాగరాజు, ఆరోగ్య రెడ్డితో పాటు ఉన్నతాధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యం: బీజేపీ నేతలు

కూకట్ పల్లి అక్టోబర్ 07 వెలుతురు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా ప్రజా జీవితంలో 25 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శోభ గార్డెన్స్ లో నిర్వహించిన 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యంతో ప్రజలను ఏకం చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన "వికసిత్ భారత్ సేవా సంకల్ప సభ, జ్యోతి యాత్ర" కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరుకాగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవ దేశానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా దేశ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే 2047 నాటికి వికసిత్ భారత్ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుట్లలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

- ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తాం
- స్రర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్

మంచాల వెలుతురు అక్టోబర్ 07: మంచాల మండలం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాల అమలులో భాగం గా అర్హులైన పేదప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేసింది ఆరుట్ల గ్రామానికి చెందిన స్మార్ట్ రేషన్ కార్డులు ఆరుట్ల గ్రామ జిపిఓ సువాసిని ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కా ర్డులు పంపిణీ చేసిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ గ్రామపంచాయతీ పాలకమండలి స భ్యులు ఈసందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముది రాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అర్హులైన పేదప్రజల కోసం ప్రవేశపెట్టే సంక్షేమ ప థకాలు అర్హులైన వారందరికీ అందేలా కృషిచేస్తాం అనిఅన్నారు స్మార్ట్ రేషన్ కార్డు తీసుకున్న ప్ర తి ఒక్కరు ఆధార్ కార్డు లాగా స్మార్ట్ రేషన్ కార్డును వినియోగించుకోవాలి అని అన్నారు ఈకా ర్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కొండిగారి శ్రావణ్ కుమార్ మంకు మమత వినో ద్ మంద మాధవి మోహన్ రెడ్డి పూన్నం రాము మహమ్మద్ ఇమ్రాన్ మాడుగుల బాలమని కృ ష్ణ గౌడ్ లాలగారి మణెమ్మ సాతిరి సత్యం గ్రామస్తులు కొల్లోజ్ జంగాచారి మంకు అంజయ్య మంకు వినోద్ మహమ్మద్ జాఫర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు కాలరాస్తున్న కాంగ్రెస్ పార్టీ

బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి

మంచాల వెలుతురు అక్టోబర్ 07: మంచాల మండలం కేంద్రంలోబీజేపీ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు నూకంరాజు ముదిరా జ్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్రనాయకుడు గో గిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి అన్నారు రాజ్యాంగం ప్రజా స్వామ్యం గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి ముందు గా స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రజలకు ఇవ్వాల్సిన గౌరవం మర్యాదను పాటించాల్సిన అవసరం ఉందన్నారు రాజ్యాంగబద్ధంగా ఎన్నుకైన సర్పంచ్ లు ఇతర స్థానిక ప్రజాప్రతినిధుల పట్లఅధికార పార్టీ ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి గారు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన విమర్శలు చేశారు రా జ్యాంగాన్ని చేతిలో పట్టుకుని రాహుల్ గాంధీ పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యం గురించిమాట్లా డటం మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజ్యాంగ బద్ధంగాఎన్నికైన ప్రజాప్రతినిధులను గౌరవించి రాజ్యాంగ విలువల ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి మాట్లా డాలని అన్నారు స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని ప్రజాసమస్యలను పరిష్క రించడంలో ప్ర భుత్వం బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారురాబోయే ఎన్నికల్లో ప్రజ లు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి తమఓ టు ద్వారా తగిన సమాధానం చెప్పాలని కోరారు ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫ లమైతే ప్రజలే ప్రజాస్వామ్య పద్ధతిలో తీర్పుఇస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు. వింజమూరి వెంకట్ రెడ్డి తాళ్లపల్లిగూడ గ్రామసర్పంచ్ జోగు శంకరయ్యరాష్ట్ర నాయకులు మారగోని శ్రీశైలం ఆగపల్లి గ్రామఉపసర్పంచ్ యాట రమేష్ కాగజ్ ఘట్ ఉపసర్పం చ్ మైలరం శ్రీను బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

టీఎస్ఐఐసీ కాలనీలో ఘనంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 07: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మరియు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన, ఎన్రోల్మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరై, అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తూ కార్యక్రమానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఫారం--18 ద్వారా తమ పేరును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు ఎంతో కీలకమని, ప్రతి అర్హుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, మహిళా అధ్యక్షురాలు హేమ లతా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , బసిరుద్దీన్, ఫిరోజ్ , చెక్క సురేష్, దొడ్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సాయిబాబా , రోషన్, లావణ్య, షైనాజ్ బేగం నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రాంతి నగర్‌లో రూ.16 లక్షల సీఎంసీ నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 07: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని క్రాంతి నగర్‌లో జవీజ నిధులు రూ. 16 లక్షల వ్యయంతో 110 మీటర్ల పొడవున నిర్మించిన సీసీ రోడ్డును లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కోటపాటి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ బాల్ రెడ్డి, పద్మారావు, మనోజ్ పాల్గొన్నారు. అలాగే శ్రీ హోమ్స్ కాలనీ అధ్యక్షులు అంజయ్య గౌడ్, క్రాంతి నగర్ కాలనీ అధ్యక్షులు బుగ్గ రెడ్డి, క్రాంతి నగర్ అసోసియేషన్ కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోట హరిబాబు, కాంగ్రెస్ నాయకులు నరేష్, నవీన్ కుమార్, నరసింహులు, కృష్ణ, జగదీష్, భాషా, శ్రవణ్ మరియు క్రాంతి నగర్ సోషల్ వెల్ఫేర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో ఎమ్మెల్సీ అభ్యర్థి సామారామ్మోహన్ రెడ్డితో కాంగ్రెస్ నేతల సమావేశం

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: బండి రమేష్

కూకట్ పల్లి అక్టోబర్ 07 వెలుతురు: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా నాయ కులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచిం చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మద్దతుగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో పాటు మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఇతర అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని బండి రమేష్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తనకు మద్దతుగా సమావేశానికి హాజరైన కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుతూ, పార్టీ శ్రేణుల సూచనలు, సలహాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతానని చెప్పారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని సామ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, వివిధ విభా గాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇమ్మామ్‌గూడలో రీ-సర్వే ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్

మహేశ్వరం వెలుతురు అక్టోబర్ 07: మహేశ్వరం మండలం ఇమ్మామ్‌గూడ గ్రామంలో చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి, ూణూా=, మహేశ్వరం తహసీల్దార్, మండల సర్వేయర్, లైసెన్స్డ్ సర్వేయర్లతో కలిసి క్షేత్రస్థాయిలో రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా రీ-సర్వేలో భాగంగా చేపడుతున్న ప్రక్రియను పకడ్బందీగా మరియు నిబంధనల మేరకు నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, ప్రతి దశను, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామంలోని రైతులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ-సర్వే ద్వారా భూముల హద్దులు స్పష్టత చెందడంతో పాటు, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తగ్గేందుకు, రైతులకు భూమి రికార్డుల విషయంలో మరింత స్పష్టత కల్పించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు వివరించారు. రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతుల సహకారం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. సర్వేయర్లు క్షేత్రస్థాయిలోకి వచ్చినప్పుడు రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, హద్దులు తదితర సమాచారాన్ని అందించి, సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కోరారు.
రైతుల సహకారంతో రీ-సర్వేను పారదర్శకంగా, శాస్త్రీయంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. రీ-సర్వే సందర్భంగా రైతులకు కలిగే సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ, వారి భాగస్వామ్యంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో బతుకమ్మ సందడి షురూ.. ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం

యాదాద్రి భువనగిరి (వెలుతురు న్యూస్) అక్టోబర్ 7: తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సౌరభానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబరాలకు రాష్ట్రం ముస్తాబ వుతోంది. పూలను పూజించే ఏకైక పండుగగా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించి ంది. తెలంగాణ పల్లెల నుంచి పట్నాల వరకు ప్రతి వాడవాడలా పూల సింగిడులు విరబూయనున్నాయి. ప్రకృతిని, జీవితాన్ని, స్త్రీత్వాన్ని గౌరవించే ఈ పండుగకు ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జీహెచ్ఎంసీ, సంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఈ తొమ్మిది రోజుల వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ రోజు అత్యంత ప్రధానమైనది. ఈ ఏడాది సద్దుల బతుకమ్మ వేడుకను అక్టోబర్ 18న హైదరాబాద్ గుండెకాయ అయిన ట్యాంక్‌బండ్‌పై లక్షలాది మంది మహిళల సమక్షంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భారీ ప్రణాళిక రూపొందించింది. సద్దుల బతుకమ్మ రోజున అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు వేలాది మంది మహిళలు తమ చేతుల్లో రంగు రంగుల బతుకమ్మలతో భారీ ర్యాలీగా తరలి రానున్నారు.

ట్యాంక్‌బండ్ మొత్తం బతుకమ్మలతో నిండిపోయి, మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడే దృశ్యం కన్నుల పండుగగా ఉండనుంది. ఈ వేడుకను తిలకించేందుకు విదేశీ ప్రతినిధులు, పర్యాటకులను కూడా ఆహ్వానించనున్నారు. సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. నెక్లెస్ రోడ్డు, బతుకమ్మ ఘాట్, ట్యాంక్ బండ్ పరిస రాల్లో ప్రత్యేక లైటింగ్, సౌండ్ సిస్టం, మహి ళలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం సాఫీగా సాగేలా ప్రత్యేక క్రేన్లు, బోట్లు సిద్ధం చేస్తున్నారు. కేవలం ట్యాంక్‌బండ్ మాత్రమే కాకుండా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పది రోజుల పాటు ప్రత్యేక సాంస్కృతిక బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో తెలంగాణ జానపద కళాకారులచే బతుకమ్మ పాటలు, కోలాటాలు, బొడ్డెమ్మ, ఒగ్గుడోలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. రాష్ట్రంలోని వరంగల్, యాదగిరిగుట్ట, బాసర, వేములవాడ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కూడా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈసారి బతుకమ్మ వేడుకలకు మరింత ప్రత్యేకత తీసుకురావడానికి ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేస్తోంది. త్వరలో జరగనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' థీమ్‌ను బతుకమ్మ లోగోలో అంతర్భాగంగా పొందుపర చనున్నారు. దీని ద్వారా తెలంగాణ సంస్కృతిని, ఇక్కడి పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటాలని ప్రభుత్వం భావిస్తోంది. బతుకమ్మ చీరల పంపిణీ కూడా త్వరలో ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మలతో సాగి చివరగా సద్దుల బతుకమ్మతో ఈ పూల జాతర ముగుస్తుంది. ఈ తొమ్మిది రోజులు తెలంగాణ మొత్తం పూల పరిమళంతో, ఆడపడుచుల సంతోషంతో నిండిపోనుంది.

రంగ కవిత గౌడ్
యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్

అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి ఆపన్నహస్తం

మునుగోడు అక్టోబర్ 07 (వెలుతురు): రూ.24 వేల ఆర్థిక సహాయం అందించిన 2003--04 పదో తరగతి మిత్రులు ఇప్పర్తి గ్రామానికి చెందిన ఇరిగి ఆంజనేయులు,తండ్రి లింగయ్య ఇటీవల గొంతులో కండ పెరగడంతో అనారోగ్యానికి గురయ్యారు. వైద్యులు పరీక్షించి ఇప్పటికే ఒకసారి చికిత్స అందించగా, ప్రస్తుతం మళ్లీ గొంతులో కండ పెరగడంతో మరోసారి ఆపరేషన్ చేయాల్సి ఉందని సూచించారు. ఆంజనేయులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్నానూ పలివెలలో 2003--04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మిత్రులు స్పందించారు. తమ మిత్రుడికి వచ్చిన కష్టాన్ని తమ కష్టంగా భావించి, అందరూ కలిసి రూ.24,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, ఆంజనేయులుకు ప్రస్తుతం మరో ఆపరేషన్ అవసరం ఉన్నందున, తమతో కలిసి చదువుకున్న మిత్రులతో పాటు దయామయులైన ప్రతి ఒక్కరూ తమకు తోచినంత ఆర్థిక సహాయం చేసి అండగా నిలవాలని కోరారు. "మిత్రుడికి కష్టం వచ్చినప్పుడు అండగా నిలవడం మా బాధ్యత. ఆంజనేయులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాం" అని వారు తెలిపారు. రూ.24,000 ఆర్థిక సహాయం అందించిన కార్యక్రమంలో బోయ లింగస్వామి, పంతంగి లింగస్వామి, ఈరటి శంకర్, కొరుపోలు అశోక్ తదితర మిత్రులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం ప్రారంభం

చౌటుప్పల్, వెలుతురు అక్టోబర్ 7: వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చౌటుప్పల్‌లో ప్రారంభించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆముదాల పరమేశ్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటర్ నమోదును సక్రమంగా పూర్తి చేసుకోవడం ముఖ్యమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు, ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆయన వివరంగా మాట్లాడారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ అభ్యర్థి శ్రీ గడల శ్రీనివాసరావు గారి కోసం జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు నిరంతరం ప్రజల్లోకి వెళ్తూ ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి అర్హత ఉన్న వారు తమను సంప్రదిస్తే ఉచితంగా ఓటర్ నమోదు ప్రక్రియలో సహాయం అందిస్తామని ఆముదాల పరమేశ్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటర్ నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కూనపురెడ్డి శివ కార్తీక్, మునుగోడు నియోజకవర్గం,రాజ పీక ప్రవీణ్, పల్చం శ్రీకాంత్, సరికొండ సంజయ్, నిఖిల్, రమణబాబు, రాజు, గణేశ్, నజీర్, సాయి తదితర జన సైనికులు పాల్గొన్నారు.

కలం కవాతు పుస్తకావిష్కరణ

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 07: తెలంగాణ ఉద్యమకారుడు,అడ్వకేట్ కట్టెల లింగస్వామి రచించిన కలం కవాతు పుస్తకావిష్కరణ కార్యక్రమం చౌటుప్పల్ లోని బి ఆర్ కే కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రచయిత కవి ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాసు పాల్గొన్నారు.

వివిధ సంఘాల ప్రతినిధులు నాయకులు బచ్చన గోని గాలయ్య, జిల్లా యాదయ్య బోరం ప్రకాష్ రెడ్డి తాడూరి పరమేష్ బాతరాజు సత్యం బోయ రామచంద్రం లింగస్వామి మల్లేష్ చిలక రాజు రాజు, సంజీవ, కొండూరు వెంకటేశం, తిగుళ్ల శ్రీనివాస్ కార్తీక్ గౌడ్, చింతల సాయిలు ఎండి ఖయ్యూం, తడక మోహన్, కాకి సుందర్ వివిధ కళాశాలల ప్రతినిధులు విష్ణుకుమార్ మహేందర్ రెడ్డి శ్రీనివాస్ శేఖర్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులు వివిధ సంఘాల ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్నటువంటి జరిగినటువంటి అనేక విషయాల మీద అద్భుతమైనటువంటి అంశాలతో అక్షరాలను ఒక దగ్గర చేర్చి ఒక

పుస్తకంగా తీసుకువచ్చిన కట్టెల లింగస్వామి కి అభినందనలు తెలిపారు. ఈ ప్రాంతం పోరాట నేపథ్యం ఉన్నదని సర్వేలు సంస్థను నారాయణపురం చౌటుప్పల్ తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించి నేడు సాహిత్యంలో కూడా మొదటి అడుగు వేయడం అభినందనీయమని ఈ ప్రాంతంలోని ఇంకా అనేక సమస్యల మీద కవితలు పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. కవి తన యొక్క బతుకును ఆవిష్కరించడంతోపాటు ప్రజల బతుకులను కూడా ఈ పుస్తకంలో ఆవిష్కరింప చేసిన ప్రయత్నం చాలా గొప్పదని ఈ సందర్భంగా కొనియాడారు . విద్యార్థిగా అధ్యాపకునిగా రచయితగా ఇంకా మరింత ముందు కొనసాగాలని ఆకాంక్షించారు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ స్థానికంగా ఉన్నటువంటి నిరుద్యోగం కాలుష్యం మీద విద్యార్థులు యువత స్పందించేలా చైతన్యం అయ్యే విధంగా పుస్తక రచన కవితల రచన కావాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకునిగా పనిచేస్తూ అధ్యాపకునిగా రచయితగా ఒక పుస్తకాన్ని ముందుకు తీసుకురావడం హర్షించదగిన విషయమని దేశంలో జరుగుతున్నటువంటి అనేక ఉద్యమాలకు ఇలాంటి పుస్తకాలు పూర్తి కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మాజీ ఏఐ ఎస్ఎఫ్ నాయకులు మిత్రులు రచయితను ఘనంగా సన్మానించారు

పోషకాహార లోపంపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పంచాయతీ అధికారి
తరుణ్ చక్రవర్తి

మునుగోడు,అక్టోబర్ 7 (వెలుతురు): గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా అధికారులు,సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి సూచించారు. బుధవారం మండలంలోని కొరటికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాటా డారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం,శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అద్దంకి రామలింగయ్య, ఉపసర్పంచ్ మందుల అంజయ్య,మండల అభివృద్ధి కార్యాలయ సూపరిండెంట్ విజయ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ఏఎన్ఎం సీహెచ్. పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అండాలు, సుజాత, యాదమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

సర్పంచ్ బొల్లం రమేష్.

మునుగోడు,అక్టోబర్ 7 (వెలుతురు): గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ బొల్లం రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాశవారి గూడెం గ్రామపంచాయతీ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ వైర్‌ను గుర్తించి,పాత వైర్‌ను తొలగించి దాని స్థానంలో కొత్త వైర్‌ను ఏర్పాటు చేయించారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వైర్ మార్పుతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మునుగోడు,అక్టోబర్ 7 (వెలుతురు) :ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్పంచ్ దాసరి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బీరెల్లిగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి,అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.గ్రామ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను సులభంగా అందించడంతో పాటు గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గోవర్ధన్ యాదవ్, ఉపసర్పంచ్ ధోటి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్న గారు,రేషన్ డీలర్ సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, పాలకవర్గం సభ్యులు దాసరి మహారాజ్, వెంపల్ల కవిత శేఖర్, దాసరి రమ్య రాంబాబు,మహిళా సంఘం అధ్యక్షురాలు దాసరి ఊర్మిళ,గ్రామ పెద్దలు దాసరి రాములు,దోటి శీను, వెంపల్ల నరసింహ, దోటి శ్రీశైలం,బూడిద లింగస్వామి,వేంపల్ల రాజమౌళి,మండలి శంకర్,దాసరి మల్లయ్య,వెంపల రాములు పాల్గొనడం జరిగింది.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మునుగోడు, అక్టోబర్ 7 (వెలుతురు): మండల పరిధిలోని పులిపలుపుల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,గ్రామ సర్పంచ్ కంభంపాటి జ్యోతి వెంకటేశ్వర్లు హాజరై అర్హులైన లబ్ధిదారులకు ఈ నూతన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని కొనియాడారు. పాత కార్డుల స్థానంలో వచ్చిన ఈ సరికొత్త కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత పెరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్డులు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పందుల అంజయ్య,గ్రామ పాలకవర్గం కంభంపాటి రాము, అరుంధతి లింగస్వామి,పగిల్ల రాము,బిక్షం,శంకర్, పంచాయతీ కార్యదర్శి గుండగాని సతీష్, సిపిఐ జిల్లా నాయకులు బోలుగురి నరసింహ,కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కొంపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం

ఆరోగ్యవంతమైన పౌష్టిక ఆహారం తీసుకోవాలి ఎంపీడీవో సునీత

నూతనకల్ అక్టోబర్ 7(వెలుతురు) మండల కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణి మహిళలకు సామూహిక శ్రీమంతాలు చేశారు. బుధవారం ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత పాల్గొని గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారాన్ని అందించి సామూహిక శ్రీమంతాలను చేశారు. అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు ముందస్తు బతుకమ్మలను రకరకాల పూలతో పేర్చి బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు. 9వ పోషణ మాసం సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు వారోత్సవాల లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో పాల్గొన్నవారు సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,

అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు గర్భిణీ స్త్రీలు తదితరులు ఉన్నారు.

మండల కాంగ్రెస్ కార్యదర్శిగా సంకు శంకర్

మునుగోడు,అక్టోబర్ 7 (వెలుతురు): మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కొంపల్లి గ్రామానికి చెందిన సంకు శంకర్ నియమి తులయ్యారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయ డంతో పాటు,కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా శంకర్ తెలిపారు.తనకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి,డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు,కొంపల్లి అభివృద్ధి ప్రదాత వెదిరె మేఘారెడ్డి,కొంపల్లి ఉపసర్పంచ్ వెదిరె విజేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అద విధంగా కొంపల్లి సర్పంచ్ జీడిమడ్ల నిర్మల దశరథతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు శంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం క్రమశిక్షణతో పనిచేస్తానని పేర్కొన్నారు .ప్రజా సమస్యలను పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు

ఎమ్మెల్యే మందుల సామెల్

మోత్కూర్ అక్టోబర్ 07, వెలుతురు న్యూస్ : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. బుధవారం మోత్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని పేదలకు అండగా నిలిచేందుకు రాష్ట్రప్రభుత్వం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుత విడతలో 2,000 ఇళ్లు కేటాయించగా, 1,500 ఇళ్లకు రూ.5 లక్షలు, ఇప్పటికే రేకులు వేసుకుని గోడలు పూర్తిచేసుకున్న మరో 500 ఇళ్లకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని 9 మండలాలు, 2 మున్సిపాలిటీలకు ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజా సంక్షేమంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులు మంజూరు పత్రాలు అందుకున్న వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్మాణ సమయంలో తనను సంప్రదిస్తే

సర్పంచ్‌లు, కౌన్సిలర్లతో కలిసి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడిగా తన చేతుల మీదుగా పేదలకు రూ.5 లక్షల విలువైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం మున్సిపాలిటీ, మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం స్వప్న, హౌసింగ్ పీడీ అలివేలు, పీఏసీఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పి. జ్యోతి, ఎంపీడీవో బాలాజీ, మున్సిపల్ కమిషనర్ జి. నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు బద్దం నాగార్జున రెడ్డి, జిల్లా నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, లక్ష్మీ నరసింహ రెడ్డి, గడ్డం సోమనర్సయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్
నాయకుడు హరీష్‌రావు...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్‌రావు భరోసా ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు ఆయనను కలిసి కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి తదితరులు హరీష్‌రావును కలిసి ఇటీవల మల్గి గ్రామసభలో యువకులపై జరిగిన దౌర్జన్యం ఘటనను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామసభలో ప్రజా సమస్యలను ప్రశ్నించిన యువకులకు ఎదురైన ఇబ్బందులు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యకర్తలకు ఎదురయ్యే సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో న్యాయపరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ ముందుంటుందని హామీ ఇచ్చారు. "కార్యకర్తలే పార్టీకి బలం. వారి కోసం ఎల్లప్పుడూ ముందుంటాం. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు" అని హరీష్‌రావు భరోసా ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

బిలాల్‌పూర్ పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. సీతారామరాజు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ల్యాబొరేటరీ, ఫార్మసీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు, పురోగతి, అమలు తీరుపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న చిన్నపాటి మరమ్మతు పనులను పరిశీలించి, త్వరి తగతిన నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, రికార్డుల నిర్వహణ, కార్యక్రమాల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. దివ్యజ్యోతి, జనూ రవికుమార్, మొగులయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నర్సింహ, సూపర్‌వైజర్ రాజమణి, ఎల్‌టీ సోనాబాయి, నిరంజన్, విశాల, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సేవా జ్యోతి ర్యాలీలో పాల్గొన్న బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 07 :
మెదక్ జిల్లా:-నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న సేవా హబ్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా జ్యోతి కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్ పాల్గొన్నారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి. జిల్లా బిజెపి నాయకులు యాదగిరి పటేల్ అశోక్ కుమార్ రమేశ్ సగుణాకర్ . సాయి పటేల్.. అధిక సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

జగిత్యాలలో వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్ర

జగిత్యాల వెలుతురు అక్టోబర్ 07:
భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు గారి ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా జగిత్యాల పట్టణంలో వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్ర కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలనతో పాటు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఎస్వీఎల్ఆర్ గార్డెన్‌లో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం ఎస్వీఎల్ఆర్ గార్డెన్ నుంచి తహశీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ కూడలి వరకు సేవా జ్యోతి పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వి. మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతు న్నామని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి, మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు వాటి ప్రయోజనాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజలకు మరింత చేరువై, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం ఎస్వీఎల్ఆర్ గార్డెన్ నుంచి ప్రారంభమైన సేవా జ్యోతి పాదయాత్ర తహశీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ కూడలి వరకు కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు సేవా సంకల్పం, వికసిత్ భారత్ లక్ష్యానికి సంబంధించిన నినాదాలతో పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వడ్డేపల్లి శ్రీనివాస్, నలవాల తిరుపతి, పిల్లి శ్రీనివాస్, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్, బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, యువ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఇట్టేడి శేఖర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మ్యాదరి అశోక్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ్, ఆఫీస్ కార్యదర్శి జుంబర్తి దివాకర్, పాత రమేష్, మర్రిపల్లి సత్యం, ఆకుల మహేష్, మల్లారెడ్డి, దొనకిల నవీన్, భాస్కర్, కుమ్మరి తిరుపతి, పంచరి విజయ్, సింగం పద్మ, మంచే రాజేష్, డీటీ వెంకటేష్, పూదరి పవన్, బన్న సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ మండలాల అధ్యక్షులు, మోర్చాల కార్యవర్గ సభ్యులు, బీజేపీ నాయకులు, ఎస్సీ మోర్చా, యువ మోర్చా, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

- సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన
- మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి
- జహీరాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ సైదా

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
సైబర్ నేరాల నుంచి బయటపడేందుకు అవగాహన ఒక్కటే ప్రధాన మార్గమని జహీరాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ సైదా అన్నారు. జహీరాబాద్‌లోని తపస్య జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు . డీఎస్పీ సైదా ఆధ్వర్యంలో సీఐ ఆర్. రవి, ఎస్ఐ ఎన్. లవకుమార్, పోలీసు సిబ్బంది విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా మోసాలపై అవగాహన కల్పించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైళ్లను తెరవకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని తెలిపారు. 'మీ కుమారుడు లేదా కుమార్తె అరెస్టయ్యారు.. మా కస్టడీలో ఉన్నారు.. కేసు లేకుండా విడిచిపెట్టాలంటే డబ్బులు పంపండి' అంటూ సీబీఐ, ముంబయి పోలీసులు, కస్టమ్స్, ఈడీ అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌కు భయపడొద్దని సూచించారు. ఎవరితోనూ ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలను పంచుకోవద్దన్నారు. పబ్లిక్ వైఫైను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా బ్యాంకింగ్ లావాదేవీలు చేయకూడదని సూచించారు. బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డు లావాదేవీలను తరచూ పరిశీలిస్తూ అనధికారిక లావాదేవీలను వెంటనే గుర్తించాలని తెలిపారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సైదా సూచించారు.

జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలి

- జహీరాబాద్ లో టియుడబ్ల్యూజే హెచ్-143 ఆధ్వర్యంలో 'ఉత్తరాల ఉద్యమం'
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డుల ద్వారా నిరసన తెలిపిన జర్నలిస్టులు....

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం వినూత్న రీతిలో నిరసన గళం వినిపించారు. టీయూడబ్ల్యూ కే హెచ్ -143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్నాని మారుతీ సాగర్ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పోస్టుకార్డులపై రాసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపించారు. అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రస్తుత ఈహెచ్ఎస్ స్థానంలో ఈజేహెచ్ ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో జర్నలిస్టుల ఆరోగ్యం, ప్రాణాలకు ప్రభుత్వ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం నుంచి జహీరాబాద్ హెడ్ పోస్ట్‌ఆఫీస్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి పోస్టుకార్డులను పోస్ట్‌బాక్స్‌లో వేశారు. జర్నలిస్టుల న్యాయపరమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గం యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ (టీఎన్ఆర్) డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో లో-వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. త్రీ ఫేజ్ విద్యుత్ కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని, దీంతో వ్యవసాయ మోటార్లు పనిచేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొ న్నారు. ఇప్పటికే సరైన సమయంలో వర్షాలు లేక పంటల సాగు, ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు ఆందోళనలో ఉండగా, విద్యుత్ సమస్యలు వారి ఇబ్బందులను మరింత పెంచుతున్నాయని అన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని, లో-వోల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని తట్టు నారాయణ కోరారు. పంట నష్టపోయే రైతులను గుర్తించి తగిన సహాయం అందించడంతో పాటు విద్యుత్, సాగునీరు, వర్షాభావ పరిస్థితులకు సంబంధించిన సహాయక చర్యలను వేగవంతం చేసి రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నారాయణఖేడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా 9వ పోషణ మాస కార్యక్రమం

- గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాల నిర్వహణ

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 07 :
సంగారెడ్డి జిల్లా:-నారాయణఖేడ్ నియోజకవర్గంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐ సి డి ఎస్) నారాయణఖేడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 9వ పోషణ మాస కార్యక్రమంలో భాగంగా విస్తృత స్థాయి పోషణ అవగాహన కార్యక్రమాన్ని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మరియు వారి తల్లిదండ్రులకు సమతుల్య ఆహారం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, చిన్నారుల ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ నగేష్ కుమార్ షెట్‌కార్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబంలో పోషకాహారంపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు అవసరమైన పోషకాహారాన్ని అందించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లులు వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు తొలి సంవత్సరాల్లో అందించే పోషకాహారం అత్యంత కీలకమని తెలిపారు. పోషణ మాస కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పోషకాహారం, ఆరోగ్యం మరియు పరిశుభ్రతపై నిరంతరం అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: జిల్లా సంక్షేమ అధికారి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి కె. లలిత కుమారి మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భధారణ సమయంలో వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, అవసరమైన టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం వంటి అవసరమైన పోషకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని, అందువల్ల గర్భిణీ దశ నుంచే తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. అలాగే చిన్నారులకు వయస్సుకు అనుగుణంగా సమతుల్య ఆహారం అందించడం, క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎదుగుదలను పర్యవేక్షించడం వంటి అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషణపై అవగాహన

ఐ సి డి ఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పిల్లలలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి, వారికి ఆరోగ్యం మరియు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా విద్యాభ్యాసానికి తొలి అడుగుగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్యం -- పోషణ -- విద్యపై సమగ్ర అవగాహన

పోషణ మాస కార్యక్రమం కేవలం ఆహారానికి మాత్రమే పరిమితం కాకుండా ఆరోగ్యం, పరిశుభ్రత, టీకాలు, తల్లి-శిశు సంరక్షణ, బాలల ఎదుగుదల, విద్య మరియు మహిళా సాధికారత వంటి అనేక అంశాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలను పాటించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, పరిశుభ్రమైన నీటిని వినియోగించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా చిన్నారులకు సరైన సమయంలో అన్నప్రాసన చేయడం, వయస్సుకు అనుగుణంగా పోషకాహారం అందించడం, టీకాలు వేయించడం, పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించడం వంటి విషయాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా "పోషకాహారం -- ఆరోగ్యకరమైన తల్లి -- ఆరోగ్యకరమైన శిశువు -- ఆరోగ్యకరమైన కుటుంబం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు
ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు సిడిపిఓ శ్రీమతి ఎన్. సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరణి, అంగన్వాడీ సూపర్వైజర్లు జమున , ప్రమీల , బ్యూలా డేవిడ్ , మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ విశాల, డిహెచ్ఈడబ్ల్ సిబ్బంది నర్సింలు , పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ నివర్తి , అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, పోషకాహార అవసరాలు మరియు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. పోషణ మాస కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేశారు.

తల్లి ఆరోగ్యం -- బిడ్డ భవిష్యత్తుకు పునాది.

పోషకాహారం -- ఆరోగ్యకరమైన సమాజానికి బలం

ప్రజా సమస్యలే ప్రథమ కర్తవ్యంగా భావించే వ్యక్తి

కౌడిపల్లి గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 7:
కౌడిపల్లి మండల కేంద్రంలో గత కొంతకాలంగా కోతుల బెడదతో పిల్లలను మహిళలను, వృద్ధులను రోజుకు ఒకరిని కరవడం జరుగుతూ ఉండే. వీటివల్ల చాలా ఇబ్బందిగా ఉందని భావించిన జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు, కౌడిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కోతులను పట్టే వారిని పిలిపించడం జరిగిందని గ్రామంలో అక్కడ అక్కడ వారిచేత బోనులను ఏర్పాటుచేయడం జరిగిందని గ్రామంలో మొత్తం కోతలను పట్టి అడవి ప్రాంతంలో వదిలేస్తామని వాటి బెడద పోయేవరకు కోతులు పట్టే వారిని గ్రామంలోనే ఉంచుతామని అన్నారు. ప్రజల సమస్యలను తీర్చడం నా ప్రథమ కర్తవ్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు. పంచాయతీ కార్యదర్శి నాగేష్, కారోబార్ ఎల్లం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పరమేష్ ముదిరాజ్ ఎన్నిక

పరమేష్ ముదిరాజ్‌కు ఘన సన్మానం

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 07 :
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం టియుడబ్లుజె హెచ్ -143 టిఇయుజె ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షునిగా ఎన్నికైన పరమేష్ ముదిరాజ్‌ను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షట్కర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలిఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పరమేష్ ముదిరాజ్ ఎన్నిక పరమేష్ ముదిరాజ్‌కు ఘన సన్మానంలిగా నగేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షునిగా ఎన్నికైన పరమేష్ ముదిరాజ్‌కు అభినందనలు తెలియజేస్తూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పరమేష్ ముదిరాజ్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మంత్ రావ్ పాటిల్, తొర్నల్ గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ ,నారాయణఖేడ్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ రెడ్డి, కొండల్ రెడ్డి మండల నాయకులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొని పరమేష్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వెలుగులు లేని వీధులు.. చర్యలు చేపట్టాలని డిమాండ్

- దసరాలోపు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి..
- 36వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 07
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో పనిచేయని వీధి దీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రవణ్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలన్నారు. వీధి దీపాల కొనుగోలుకు మున్సిపల్ కౌన్సిల్‌లో ఎజెండా ఆమోదించిన ప్పటికీ ఇప్పటివరకు ఏర్పాటు పూర్తికాలేదని తెలిపారు. ఇప్పటికే బతుకమ్మ, వినాయక చవితి పండుగలు పూర్తయ్యాయని, కనీసం దసరా పండుగలోపు వీధి దీపాల ఏర్పాటు పూర్తి చేయాలని కోరారు. 36వ వార్డుతో పాటు పట్టణంలోని ఇతర వార్డుల్లో పనిచేయని వీధి దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను అప్పం శ్రవణ్ కుమార్ కోరారు.

మనిషి బయటకు కనిపించే రూపానికీ, అతని మనసులో దాగి ఉన్న భావాలకీ మధ్య ఉన్న తేడాను తెలియజేస్తోంది

మనిషి బయటకు కనిపించే రూపానికీ, అతని మనసులో దాగి ఉన్న భావాలకీ మధ్య ఉన్న తేడాను తెలియజేస్తోంది. మనకు కనిపించేది ఒక చిరునవ్వు మాత్రమే కావచ్చు... కానీ ఆ చిరునవ్వు వెనుక అతను ఎదుర్కొంటున్న కష్టాలు, మోస్తున్న బాధలు మనకు తెలియక పోవచ్చు.

సముద్రం పైకి ప్రశాంతంగా కనిపించినా, దాని లోతుల్లో ఎన్నో ప్రవాహాలు ఉంటాయి. మనిషి మనసు కూడా అలాంటిదే. బయటకు నవ్వుతూ మాట్లాడుతున్న వ్యక్తిలో కూడా చెప్పుకోలేని దిగులు, తీరని ఆశలు, కోల్పోయిన బంధాల జ్ఞాపకాలు, రేపటి గురించి ఆందోళనలు ఉండవచ్చు. పైకి కనిపించే ప్రశాంతతను బట్టి, లోపల కూడా అంతా ప్రశాంతంగానే ఉందని నిర్ణయించలేం.

కొంతమంది కుటుంబ బాధ్యతలను మోస్తారు. మరికొందరు ఆర్థిక ఇబ్బందులతో పోరాడుతారు. ఇంకొందరు నమ్మినవారి నిర్లక్ష్యాన్ని, అవమానాలను, ఒంటరితనాన్ని భరిస్తారు. ఎవరి బాధ వారికి భారమైనదే. మనకు చిన్న విషయంగా కనిపించేది, ఎదుటివారి మనసును తీవ్రంగా గాయపరిచే విషయం కావచ్చు.

మనిషి తన బాధను దాచుకోవడానికి ఎన్నో కారణాలు ఉంటాయి. చెప్పినా అర్థం చేసుకోరేమోననే భయం ఉండవచ్చు. తన వాళ్లను కలవరపెట్టకూడదనే ఆలోచన ఉండవచ్చు. తన బలహీనతను ఇతరులు ఉపయోగించుకుంటారేమోననే అనుమానం ఉండవచ్చు. అందుకే కొన్నిసార్లు "నేను బాగున్నాను" అనే చిన్న మాట వెనుక, చెప్పలేనంత పెద్ద కథ దాగి ఉంటుంది.

చిరునవ్వు కూడా కొన్నిసార్లు మనసుకు ఒక ముసుగుగా మారుతుంది. బాధ ఉన్నప్పటికీ బాధ్యతలను నిర్వర్తించడానికి, ఇతరులతో కలిసిపోవడానికి, తనను తాను నిలబెట్టుకోవడానికి మనిషి నవ్వుతాడు. అయితే ప్రతి చిరునవ్వూ బాధను దాచేదే అని భావించాల్సిన అవసరం లేదు. నవ్వుతున్న వ్యక్తికీ మనం చూపే ఆప్యాయత, మనసుపెట్టి వినే సహనం అవసరమవుతాయని గుర్తుంచుకోవాలి.

మీ వాక్యంలోని "పాడెక్కిన తర్వాతే విశ్రాంతి దొరుకుతుంది" అనే భావం, జీవితాంతం బాధను మోస్తున్న మనిషి అలసటను తీవ్రంగా వ్యక్తపరుస్తోంది. కానీ బాధకు ఉపశమనం జీవితంలోనే దొరకవచ్చు. నమ్మకమైన వ్యక్తితో మాట్లాడటం, అవసరమైన సహాయం తీసుకోవడం, మనకు బాధ కలిగించే పరిస్థితుల్లో మార్పులు చేయడం ద్వారా మనసులోని భారాన్ని తగ్గించుకోవచ్చు. మన బాధకు వినే చెవి దొరికినప్పుడు, మౌనంగా మోస్తున్న బరువులో కొంతైనా దిగిపోతుంది.

ఈ సందేశం మనకు నేర్పేది---ఎదుటివారి జీవితం గురించి పూర్తిగా తెలియకుండా తీర్పు చెప్పకూడదని. "నీకు ఏం తక్కువ?" అని ప్రశ్నించే ముందు, "నీ మనసులో ఏముంది?" అని ఆప్యాయంగా అడగాలి. ఎవరికైనా చెప్పుకోవాలని ఉన్నప్పుడు, వారి బాధను తక్కువ చేసి చూడకుండా వినాలి. మన చిన్న పలకరింపు కూడా ఒకరి రోజును మార్చవచ్చు.

మనిషి చిరునవ్వును మాత్రమే చూడకండి...
ఆ చిరునవ్వు వెనుక ఉన్న మనసునూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.
బాధను చెప్పుకునే అవకాశం ఇవ్వండి...
తోడుగా నిలిచే మనిషిగా ఉండండి.

మీ నక్క యాదగిరి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఇందిరాపార్క్ వద్ద బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 7
పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో వేలాది మంది నిరుపేద విద్యార్థులు కళాశాలల్లో ధ్రువపత్రాలు అందక ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దూరమవుతు న్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ హైదరాబాద్ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్, రాజ్యసభ సభ్యులు, ప్రముఖ జాతీయ బీసీ నేత ఆర్.కృష్ణయ్య, బీసీ సీనియర్ నాయకులు, మాజీ ఐఏఎస్ నాగరాణి, బీఆర్ఎస్ మాజీ ఎంపీ డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్‌తో పాటు వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు ఎదునూరి రమేష్, ధర్మ సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు, బీసీ జేఏసీ ముఖ్య సలహాదారు జంగపల్లి రాములు, మంచిర్యాల జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షులు మంచర్ల సదానందం, మందమర్రి మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షులు మేడి రాజుతో పాటు ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడటం సహించేది లేదని హెచ్చరించారు. బకాయిలు చెల్లించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పది

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- ట్రస్మా ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో ఘనంగా ప్రైవేట ఉపాధ్యాయులకు ఆచార్యదేవోభవ అవార్డుల వేడుక

యాదగిరిగుట్ట, అక్టోబర్ 7 వెలుతురు
సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, తల్లిదండ్రుల తర్వాత అత్యంత ఉన్నతమైన స్థానం ఉపాధ్యాయులదేనని, వారు అందించే విద్యాబుద్ధులే విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. బుధవారం యాదగిరిగుట్టలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన 'ఆచార్య దేవోభవ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయులకు 'ఆచార్య దేవోభవ' పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువల వల్లే తాను నేడు ఎమ్మెల్యే స్థాయికి చేర్చాయని గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయవృత్తిలో ఎలాంటి స్వార్థం ఉండదని, సొంత పిల్లలకంటే ఎక్కువగా పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్ది లోకానికి వెలుగు నిచ్చేది గురువులేనని అన్నారు. ఒక విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు తల్లిదండ్రుల కంటే ఎక్కువగా సంతోషపడేది గురువులేనని తెలిపారు. వైద్యులకు పేరు ముందు 'డాక్టర్(డా.)' అని ఎలాగైతే గుర్తింపు ఉంటుందో, అదే తరహాలో ఉపాధ్యాయులకు కూడా పేరు ముందు 'టీచర్(టీ.)' అనే హోదా కల్పించే విధానాన్ని కర్ణాటకలో అమలు చేశారని, ఇదే తరహా గౌరవాన్ని తెలంగాణలోని ఉపాధ్యాయులకు కూడా అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. యువత చెడు వ్యసనాలు, మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ సలాం లు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. కాగా ఈ కార్యక్రమం ట్రస్మా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన కొనసాగగా ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, రాష్ట్ర సలహాదారులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు బండి రాజుల శంకర్, దాసన్ రెడ్డి, ఈ అచ్చయ్య గౌడ్, రాంరెడ్డి, కృష్ణంరాజు, సయ్యద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది టీచర్లకు అవార్డులు అందించి సత్కరించారు. మరో 63 మంది కరస్పాండెంట్లను, సుమారు 20 మంది ప్రిన్సిపాల్ లకు కూడా అవార్డులు అందించి సత్కరించారు. అధ్యంతం ఈ కార్యక్రమం కన్నుల పండుగగా కొనసాగింది.

నల్లకుంట ఫీవర్ సర్వే, యాంటీ లార్వల్ కార్యకలాపాలు పరిశీలన

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
బుధవారం రోజున నల్లకుంట ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వే, యాంటీ లార్వల్ కార్యకలాపాలు మరియు అవగాహన కార్యక్రమాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు లు, ఆశా లు మరియు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, లార్వా నియంత్రణ చర్యలు మరియు ప్రజలకు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి సకాలంలో యాంటీ లార్వల్ మరియు ఇతర నియంత్రణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా బస్తీ దవాఖానలను సంప్రదించి ఉచిత వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా. సాయి బాబా, డా. శ్రీకర, వైద్యాధికారి డా. దీప్తి పటేల్, జిల్లా మలేరియా అధికారి ఎస్. అంజనేయులు, మలేరియా సిబ్బంది మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు మరియు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు. తదనంతరం ఫీవర్ హాస్పిటల్‌ను సందర్శించి, ఆసుపత్రిలోని ఓపీ మరియు ఇన్‌పేషెంట్ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న రోగులతో

స్వయంగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకు, అవసరమైన వైద్య సూచనలు అందించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంలో ఫీవర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. మసాఖాన్, ఆర్ఎంఓ డా. వీరాంజనేయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దసరా కానుకగా రెండు డీఏల మంజూరు

- గెజిటెడ్ అధికారుల హర్షం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు
- డీఏల సాధనకు నిరంతరం కృషి చేసిన రాష్ట్ర టీజీవో నాయకత్వానికి అభినందనలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 07
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా పండుగ కానుకగా రెండు కరువు భత్యం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు మన్నెబోయిన ఎం.బి. కృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ, ఉద్యోగుల దీర్ఘకాలిక ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని రెండు డీఏలను మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, దసరా పండుగ సందర్భంగా రెండు డీఏలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండు డీఏల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, ఉద్యోగుల ఆకాంక్షలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన రాష్ట్ర టీజీవో అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ గారికి కూడా హైదరాబాద్ జిల్లా శాఖ ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపింది. రాష్ట్ర సంఘం నాయకత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగించడంతో పాటు ఉద్యోగ వర్గాల్లో ఆనందం, నూతనోత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ అశన్న, వైస్ ప్రెసిడెంట్ ఎంజల్ రెడ్డి, ట్రెజరర్ మదుగూరి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ క్రాంతి విద్యాసాగర్, టీజీవో అభిలాష, టి.వి. సరస్వతి, చంద్రజ్యోతి, సందేశ్ శ్రీవాత్సవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మరో సత్యాగ్రహ పోరాటం మొదలైంది

- రాహుల్, ప్రియాంక అరెస్ట్ బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనం
- సమాధానం ఇవ్వలేకనే దేశ రాజధానిలో ఆంక్షలు
- ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న బీజేపీ
- కేంద్రం తీరుపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 07
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలు,కాంగ్రెస్ నాయకుల అరెస్ట్‌లను రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణపై రాహుల్ గాంధీ పోరాటం ద్వారా దేశంలో మరో సత్యాగ్రహ పోరాటం మొదలైందన్నారు. అందుకే బీజేపీ భయపడి దేశ రాజధానిలో ఆంక్షలు విధించిందన్నారు. ఆంక్షలు విధించి విపక్షాలను పోలీసు బలగాలతో అణచివేయాలనుకోవడం బీజేపీ పిరికిపంద చర్యకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగబద్ధమైన హక్కు. కానీ బీజేపీ పోలీసు బలగాలను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని యత్నిస్తోందన్నారు. ఈసీ కార్యాలయం వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పార్లమెంట్ సభ్యులు మరియు కాంగ్రెస్ శ్రేణుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైనదన్నారు. ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, పోలీసు బలగాలతో నిర్బంధాలు విధించినా కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున, రాజ్యాంగం, రాజ్యాంగబద్ధసంస్థల పరిరక్షణ కోసం పోరాటాన్ని ఆపేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తేల్చి చెప్పారు.

అవంతి నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దానం నాగేందర్, మహాలక్ష్మి రామన్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
హిమాయత్ నగర్ డివిజన్ పరిధిలోని అవంతి నగర్‌లో నూతనంగా ప్రారంభమవుతున్న సీసీ రోడ్డు (జజ =శీఎం) పనులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాలనీ వాసులతో ముచ్చటించి, అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అవంతి నగర్ కాలనీ ప్రెసిడెంట్, స్థానిక కాలనీవాసులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన గణనలో ఓబీసీ కాలము చేర్చాల్సిందే

- ఢిల్లీ లోని కాన్స్టిట్యూషన్ క్లబ్ లో జరిగే జాతీయ అఖిల పక్ష ఓబీసీ సమావేశానికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీ కి తెలంగాణ ఎక్స్ప్రెస్ లో బయలుదేరిన బీసీ శ్రేణులు
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ వెల్లడి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 07:
కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో ఎస్సీ,ఎస్టీ లతోపాటు ఓబీసీ కాలమును కూడా చేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఢిల్లీ లోని కాన్స్టిట్యూషన్ క్లబ్ లో జరిగే జాతీయ ఓబీసీ సమావేశానికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీ కి తెలంగాణ ఎక్స్ప్రెస్ లో బయలుదేరి వెళ్లినట్టు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ వెల్లడించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చి ఈరోజు ఆ యొక్క హామీని విస్మరించిందని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సినటువంటి మిగతా పార్టీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని అన్నారు. బీసీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్న బీసీల సమస్యలు తీరడం లేదన్నారు. బీసీల జనాభా ఎంతో తేలితేనే వారికి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో నిష్పత్తి ప్రకారం వాటా దక్కుతుందని అన్నారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, యువజన సంఘం అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మ మహిళా సంఘం అధ్యక్షురాలు మణి మంజరి బండిగారి రాజు గౌతమి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 7:
తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతికత, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో మంగళవారం జరిగిన డీఇ షా (ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డీఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కత్కర్‌లు మంత్రిని అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డీఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డీఇ షా ఇండియా ప్రస్థానం ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకోవాలని ఆకాంక్షించారు. "ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కర్తలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు. డీఇ షా నియోపోలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. "నియోపోలిస్‌లో డీఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ యువ ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఇ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. "ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఇ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. "డీఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించి
పంటలను కాపాడుకోవాలి

ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 07: ఎల్‌నినో ను దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే శ్రీ పాయల్ శంకర్ కోరారు. మంగళవారం కోర్టా-చనాకా ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తక్కువ వర్షపాతం, ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహాలు లేకపోవడం, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన కాలువల ద్వారా వచ్చే నీటిని స్థానిక చెరువులు, కుంటలు, వాగులు మరియు ఇతర నీటి వనరులను నింపేలా సమర్థవంతంగా విని యోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి వినియోగంలో సామర్థ్యాన్ని పెంచాలని కోరారు.రైతులు పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ వృథాను నివారించాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమష్టి కృషితో అందుబాటులో ఉన్న నీటితో పంటలను కాపాడుకో వచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కును కాలరాయడం అంటే
ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

- సర్ ప్రక్రియ లోప భూయిష్టంగా ఉంది
- రాహుల్‌గాంధీ శాంతియుత ధర్నాను అడ్డుకోవడం దుర్మార్గం : మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ వెలుతురు అక్టోబర్ 07: దేశంలో ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఎంత ముఖ్యమో, ఓటు హక్కు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమ అభివృద్ధి,పశుసంవ ర్ధక, మత్స్య, యువజన సేవలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశా రు. మక్తల్‌లోని క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును కోల్పోవద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా శాంతియుత ధర్నాలకు పిలుపునిచ్చారని మంత్రి తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని, దేశ వ్యా ప్తంగా ఓట్ల తొలగింపుపై అనేక అను మానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓ ట్లు అధికంగా తొలగిస్తున్నారనే ఆందో ళన ఉందని పేర్కొన్నారు.మక్తల్ నియోజక వర్గంలో 70 వేల ఓట్లు తొలగించారని మంత్రి ఆరోపించారు. ఓటు హక్కును కోల్పోవడం అంటే ప్ర జాస్వామ్యంలో ఒక పౌరుడి గొంతును కోల్పోయినట్లే నని అన్నారు. ఓటు హ క్కును కాలరాయడం అంటే బ్రతికున్న వ్యక్తిని చంపడమేనని మంత్రి తీవ్రం గా వ్యాఖ్యానించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ నేపథ్యంలో జరుగుతున్న ఆందోళనలను అణచివేసే ప్రయ త్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధ మని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వా నికి అనుకూలంగా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందన్న ప్రతిప క్షాల ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణపై వ్యక్తమవుతున్న అభ్యంత రాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంద న్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం కు వ్యతిరేకంగా శాంతియు తంగా నిరసన తెలిపిన రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయడం దుర్మార్గమని మంత్రి ఖండించారు. జ్ఞానేష్ కుమార్ ప్రజల ఓటు హక్కును కాలరాసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఆయ నను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చట్టాలను, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మంత్రి వాకి టి శ్రీహరి అన్నారు. రాబోయే రోజు ల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశా రు. ప్రజల ఓటు హక్కును కాపాడే వ రకు తమ పోరాటం కొనసాగు తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి
రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలి

- అందుకు మంత్రి పొంగులేటి చొరవ తీసుకోవాలి
- వేతనాలు, హక్కులు, సంక్షేమ పథకాల అమలు కోసం జేఏసీ ఏర్పాటు
- డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ ప్రత్యేక దృష్టి
- కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు ఏఐపై పట్టు సాధించాలి
- వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్

ఖమ్మం వెలుతురు, అక్టోబర్ 07: జర్నలిస్టుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు అన్ని జర్నలిస్టు సంఘాలతో కలిపి హైదారాబాద్ లో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించ డంతో పాటు వారికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేయక పోతే, జర్నలిస్టుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. మీ సహచర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ లేబర్ చట్టాలకు అనుగుణంగా ఆటో కార్మికులకు కూడా న్యాయం కోసం బాధ్యతగా వ్యవహరిస్తు ఆటో యూనియన్లతో సమీక్షలు నిర్వహించి వారికి తగినటువంటి న్యాయానికి పూనుకున్నారని విషయము మరువరాదని ఆటో కార్మికుల కంటే దీనమైనటువంటి గడ్డు పరిస్థితులు ఈరోజు కలం యోధులైన జర్నలిస్టులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. బుధవారం ఖమ్మంలోని టీటీడీసీ బిల్డింగ్ లో డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ అధ్యక్షతన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల యూనియన్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాణా ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోవు రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపై పోరాడేందుకు అన్ని జర్నలిస్టు సంఘాలతో కలిపి జేఏసీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఇది కేవలం రాష్ట్రానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా వివిధ జర్నలిస్టు సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఐక్య పోరాటాలు సాగిస్తామన్నారు. జర్నలిస్టులకు చట్ట బద్ధంగా దక్కాల్సిన వేతనాలు, సంక్షేమ పథకాలు, అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, హక్కుల సాధన కోసం డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో కూడా నిరంతర పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ రంగంలో పని చేస్తున్న వేలాది మంది జర్నలిస్టులు కనీస వేతనాలు, భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా యాజమాన్యాలు కనీస వేతనాలు కూడా చెల్లించకుండా జర్నలిస్టులతో వెట్టి చాకిరీ చేయించుకోవడం దారుణమని, జర్నలిస్టులకు న్యాయంగా దక్కాల్సిన వేతనాలు, ఇతర సదుపాయాల కోసం యాజమాన్యాలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేకించి డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై కూడా తమ సంఘం దృష్టి సారిస్తుందన్నారు. ప్రభుత్వ పరంగా జర్నలిస్టులకు అమలుకావాల్సిన సంక్షేమ పథకాలను సమర్థవం తంగా అమలు చేయించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా పని చేస్తూ, దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్మిస్తోందని తెలిపారు. ప్రస్తుతం జర్నలిజంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోక పోతే జర్నలిస్టులు వెనుకబడే ప్రమాదం ఉందని రాణా ప్రతాప్ హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ప్రతి జర్నలిస్టు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఐ సాయంతో వార్తలను రూపొందించే విధానాలు, వార్తా రచనలో సాంకేతికతను వినియోగించుకునే పద్ధతులను ఆయన వివరించారు.

పల్లె ఉత్పత్తులకు పట్టం కట్టిన సారస్

- హైదరాబాద్‌లో ఘనంగా సారస్ మేళా ప్రారంభం
- పల్లె ఉత్పత్తులకు నగర మార్కెట్‌తో అనుసంధానం
- 20కి పైగా రాష్ట్రాల నుంచి 200కు పైగా స్టాళ్లు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 07: హైదరాబాద్ నగరంలో గ్రామీణ భారతదేశపు కళలు, చేనేతలు, సంప్రదాయ రుచులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో సారస్ మేళా బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఒకవైపు హస్త కళలు చేతివృత్తులు, మరోవైపు తెలంగాణ సంప్రదాయ వంటకాలు, తిరునల్వేలి హల్వా, ఈశాన్య రాష్ట్రాల మోమోలు, ఇతర రాష్ట్రాల రుచులు, పేరిని నృత్యం, శివతాండవం వంటి తెలంగాణ నృత్యాలు, పల్లె పదాలు, జానపద పాటల మధ్య సారస్ అట్టహాసంగా మొదలైంది. ప్రారంభ సూచకంగా సెర్ప్ డైరెక్టర్లతో కలిసి సీఈఓ దివ్య దేవరాజన్, జ్యోతి ప్రజ్వలన చేసి సారస్ మేళ ను ప్రారంభించారు. ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో అక్టోబర్ 7 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ మేళాను తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ నిర్వహిస్తోంది.దేశంలోని వివిధ ప్రాంతాల గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు నగర మార్కెట్‌కు అందుబాటులోకి తెచ్చే విధంగా సారస్ ఫెయిర్ కొనసాగుతోంది. ఈసారి 200కు పైగా స్టాళ్లలో చేనేతలు, హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, హెర్బల్ ఉత్పత్తులు, గ్రామీణ తయారీ వస్తువులు, లైవ్ ఫుడ్ అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ నుంచి 95 స్టాళ్లు ఏర్పాటు కాగా, ఇతర రాష్ట్రాల నుంచి 100కు పైగా స్టాళ్లు పాల్గొంటున్నాయి. వివిధ ప్రభుత్వ, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మరో 43 స్టాళ్లు ఏర్పాటు చేశారు. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలతో పాటు చెక్క బొమ్మలు, జూట్, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, బంజారా కళాకృతులు, ఎంబ్రాయిడరీ, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఉత్పత్తులు కూడా ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యక్ష మార్కెట్ అందించే వేదికగా..

సారస్ మేళా కేవలం కొనుగోలు, విక్రయాలకు పరిమితం కాకుండా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యక్ష మార్కెట్ అనుభవాన్ని అందించే వేదికగా నిలుస్తోంది. వినియోగదారుల అభిరుచులు, ధరలు, ప్యాకేజింగ్, ఉత్పత్తుల నాణ్యతపై నేరుగా స్పందన తెలుసుకునే అవకాశం లభిస్తోంది. తద్వారా భవిష్యత్‌లో బల్క్ ఆర్డర్లు, మార్కెట్ లింకేజీలు, వ్యాపార అవకాశాలకు మార్గం ఏర్పడనుంది. మేళాలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. మొదటిరోజు శివతాండవం పేరని నృత్యం హైలెట్‌గా నిలిచాయి. అక్టోబర్ 12న బతుకమ్మ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. మంత్రి సీతక్కతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పల్లె ఉత్పత్తులు, మహిళల శ్రమ, దేశీయ కళలు, తెలంగాణ సంస్కృతిని హైదరాబాద్ నగర ప్రజలకు చేరువ చేస్తున్న సారస్ మేళా ఈ నెల 18 వరకు కొనసాగనుంది.

గిరిజన ఆభరణాలతో సారిక ప్రత్యేక ఆకర్షణ

సారిక ముడావత్ (35) గిరిజన ఆభరణాల తయారీతో కనుమరుగవుతున్న కళారూపానికి జీవం పోస్తున్నారు. సరస్ మేళాలో ప్రతి ఏడాది కనీసం రూ.లక్ష ఆదాయం ఆర్జిస్తున్నానని ఆమె తెలిపారు. గత నాలుగేళ్లుగా సరస్ మేళాలో పాల్గొంటున్న సారిక, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో గిరిజన ఆభరణాల తయారీ, విక్రయాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మార్కెటింగ్ అవకాశాలను

వినియోగించుకుంటున్నారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలైన సారిక, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

సంప్రదాయ కళకు ఆధునిక హంగులు

మంగా పసుల (40) చెరియాల్ మాస్కులు, వాల్ డెకార్ తయారు చేస్తున్నారు. కలప, చింతగింజల మిశ్రమంతో రూపొందించే ఈ కళాఖండాలు జానపద నాటక సంప్రదాయాలను ఆధునిక ఇంటీరియర్లకు చేరువ చేస్తున్నాయి. చెరియాల్ చిత్రకళా సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ప్రకాశవంతమైన రంగులు, కథనాత్మక రూపాలు, భావోద్వేగాలను పలికించే ముఖ కవళికలతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. గిఫ్ట్‌గా ఇచ్చేందుకు అనువుగా చిన్న సైజు ఫ్రేమ్‌లను కూడా తయారు చేస్తున్నామని మంగా తెలిపారు.

గుజరాత్ నుంచి వచ్చి ఖడ్డీ ఉత్పత్తుల విక్రయం

గుజరాత్‌కు చెందిన రంజన్ పర్మార్ (45) సరస్ మేళాలో చేతితో తయారు చేసిన ఖడ్డీ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కుషన్ కవర్లు, బ్యాగులు, దుస్తులు తదితర అనేక రకాల ఉత్పత్తులు ఆమె స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి. సరస్ మేళాలో స్టాల్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని రంజన్ తెలిపారు. మేళా ద్వారా మంచి అమ్మకాలు సాధించి, జ్ఞాపకాలతో పాటు ఆదాయంతో స్వస్థలానికి తిరిగి వెళ్తామనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

తెలంగాణ ఇకత్‌కు దేశవ్యాప్తంగా మార్కెట్

జనగామకు చెందిన రామలక్ష్మి మసురం (35) చేతితో తయారు చేసిన ఇకత్ వస్త్రాలను సరస్ మేళాలో ప్రదర్శిస్తున్నారు. భర్త సహకారంతో దేశవ్యాప్తంగా జరిగే ఎక్స్‌పోల్లో పాల్గొంటూ తెలంగాణకు చెందిన హస్తకళా, చేనేత ఉత్పత్తులను వివిధ ప్రాంతాలకు పరిచయం చేస్తున్నారు. స్వచ్ఛమైన కాటన్ హ్యాండ్‌లూమ్, కొత్త డిజైన్లతో కూడిన సరసమైన ధరల ఉత్పత్తులు, ప్రింటెడ్ చీరలు, ప్రింటెడ్ తెల్ల చీరలు, బెడ్‌షీట్లు, టవల్స్, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బ్లౌజులు తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. సరస్ మేళాల్లో స్టాల్ ఏర్పాటు చేసేందుకు ఎలాంటి రుసుము వసూలు చేయకపోవడంతో లాభదాయకమైన్నారు.

మంజీరా సింగూరు నీళ్లను జాగ్రత్తగా వాడుకోండి

- వచ్చే ఏడు నెలలు నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు జగ్గారెడ్డి సూచన

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 07 : సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న ఏడు నెలలు తాగునీటి విషయంలో పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను జాగ్ర త్తగా వినియోగించుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసి డెంట్ జగ్గారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తాగునీ రు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికా రులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, సంగా రెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. సింగూరు ప్రాజెక్టులో 29 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే ఉందని సమావేశంలో అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న నీటితో డిసెంబర్ వరకు తాగునీటి సరఫరా కొనసాగించగలమని భావిస్తున్నట్లు తెలి పారు. దసరా తర్వాత రోజు విడిచి రోజు తాగునీరు విడుదల చేయనున్నట్లు మిషన్ భగీరథ ఎస్‌ఈ వెల్లడించారు. నీటి కొరతపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలి టీలతో పాటు నాలుగు మండలాల గ్రామాల్లో నీటి లభ్యత, పొదుపుపై చాటింపు వేయాలని సూచిం చారు. మం జీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నీటి డ్రాయింగ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అను గుణంగా నియంత్రించేలా విజ్ఞప్తి చేస్తే, సంగారెడ్డి మున్సిపాలిటీకి మరికొంత కాలం తాగునీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు. అవసరమైతే మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వాయు కాలుష్య నియంత్రణకు సమగ్ర కార్యాచరణ

- శాస్త్రీయ పర్యవేక్షణతో కాలుష్య మూలాల నియంత్రణ
- శాఖల సమన్వయంతో చర్యలు.. వాయు నాణ్యత మెరుగుదలకు ప్రాధాన్యం
- స్వచ్ఛ వాయు సర్వేక్షణలో నల్గొండకు జాతీయ గుర్తింపు
- జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్‌పై ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ హర్షం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 07 : తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ (ఎక్యుఎంసీ) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్ర మాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్ర టరీ, కమిటీ ఛైర్మన్ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చ దనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణ కొనసాగుతోం దని తెలిపారు. సెక్రటేరియట్‌లో అహ్మద్ నదీమ్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ, కమిటీ మెంబర్ కన్వీనర్ రవి నిర్వహించిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆమోదించిన కార్యాచరణ ప్రణాళికలోని అంశాలపై చర్చించారు. సమావేశంలో సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, ఎన్‌సీఏపీ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సీడీఎంఏ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, టీజీఎస్‌ఆర్టీసీ, హైదరాబాద్, సైబరా బాద్, మల్కాజ్‌గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టీజీ ఐఐసీ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలపై సమీక్ష నిర్వహించారు.

పీఎం10 స్థాయిలపై పర్యవేక్షణ

2019--20 నుంచి 2025--26 వరకు నమోదైన వార్షిక సగటు పీఎం10 స్థాయిలను పరిశీలిస్తే హైదరాబాద్‌లో 86 నుంచి 80 గ్రా/ఎటకు, సంగారెడ్డిలో 87 నుంచి 78 గ్రా/ఎటకు తగ్గుదల నమోదైంది. నల్గొండలో 59 నుంచి 71 గ్రా/ఎటగా నమోదైంది. 2025--26లో హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డిలో పీఎం10 సగటు స్థాయిలు వరుసగా 80, 71, 78 గ్రా/ఎటగా నమోదయ్యాయి. వాయు నాణ్యత సూచీ ప్రధానంగా 'సంతృప్తికర' నుంచి 'మధ్యస్థ' కేటగిరీలలో ఉన్నట్లు సమీక్షలో నమోదైంది.

పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం

సీయూఆర్‌ఈ ప్రాంతంలో వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షించేందుకు 13 నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించేందుకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. సీఏఏక్యూఎంఎస్‌ల నుంచి లభించే డేటాను అందుబాటులోకి తీసుకురావడానికి ఎయిర్ క్వాలిటీ డ్యాష్‌బోర్డు అభివృద్ధి ప్రక్రియ కొనసాగుతోంది. సంబంధిత శాఖలకు ఎస్ఎంఎస్ అలర్ట్‌ల ద్వారా వాయు నాణ్యత సమాచారం చేరవేయనున్నారు. బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 తక్కువ వ్యయ వాయు నాణ్యత పర్యవేక్షణ సెన్సార్లను ఏర్పాటు చేశారు.

రోడ్ డస్ట్, వాహన కాలుష్యంపై దృష్టి

రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను ఎన్‌సీఏపీ కింద చేపడుతున్నారు. మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టీజీపీసీబీ నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, పీయూసీ వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని 516 పీయూసీ కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. పీయూసీ గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలుకు ఏఎన్‌పీఆర్ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంపు:

హైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. టీజీఎస్‌ఆర్టీసీ ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో 310 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అదనంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. పీఎం ఈ-డ్రైవ్ కింద రాష్ట్రానికి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రక్రియ కొనసాగుతోంది.

కాలుష్య మూలాల అధ్యయనం

నల్గొండ, సంగారెడ్డి ప్రాంతాల్లో సోర్స్ అపోర్షన్‌మెంట్ స్టడీ ద్వారా వాయు కాలుష్యానికి కారణమవుతున్న వివిధ మూలాలను శాస్త్రీయంగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐటీ బాంబే సమర్పించిన డ్రాఫ్ట్ తుది నివేదికను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మరింత మెరుగుపరచేందుకు టీజీపీసీబీ, ఇతర నిపుణ సంస్థలు సూచనలు అందించాయి. అధ్యయన ఫలితాలను భవిష్యత్ కాలుష్య నియంత్రణ చర్యలకు ఉపయోగించనున్నారు.తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ కోసం స్టేట్ యాక్షన్ ప్లాన్‌ను మరింత శాస్త్రీయంగా బలోపేతం చేసేందుకు టీజీపీసీబీ, యునైటెడ్ నేషన్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్‌తో కలిసి ఉద్గారాల సమగ్ర లెక్కింపుపై చర్యలు చేపడుతోంది. వివిధ శాఖల నుంచి అమలు నివేదికలను సేకరిస్తున్నారు. అన్ని జిల్లాలకు జిల్లా స్థాయి అమలు కమిటీల పరిధిని విస్తరించే ప్రతిపాదనలు సమర్పించారు.

పరిశ్రమలు, డీజీ సెట్ల ఉద్గారాల నియంత్రణ

పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు నాణ్యత పర్యవేక్ష ణను బలోపేతం చేయడంతో పాటు నిర్మాణ ప్రాం తాలు, ఇతర ప్రధాన కాలుష్య ఉత్పత్తి ప్రాంతాల్లో సెన్సార్ వ్యవస్థలను విస్తరిస్తున్నారు. డీజిల్ జనరేటర్ సెట్ల నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రిం చేందుకు రెట్రోఫిట్ ఎమిషన్ కంట్రోల్ డివైజెస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యుత్ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.వ్యవసాయ అవశేషాలను బహిరంగంగా దహనం చేయడం వల్ల వాయు కాలుష్యం పెరగకుండా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ అవశేషాలను బ్రికెట్లు, పెల్లెట్లుగా మార్చి సంప్రదాయ ఘన ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రికెట్ తయారీ యూనిట్ల ఏర్పాటు ప్రారంభమైంది.

నిధుల వినియోగంపై సమీక్ష

ఎన్‌సీఏపీ, 15వ ఫైనాన్స్ కమిషన్ కింద విడుదలైన నిధులను నిర్దేశిత వాయు కాలుష్య నియంత్రణ చర్యలకు సమర్థవంతంగా వినియోగించడంపై కమి టీ సమీక్షించింది. హైదరాబాద్‌లో ఎన్‌సీఏపీ కింద విడుదలైన నిధుల్లో 90.27 శాతం, నల్గొండలో 82.5 శాతం, పటాన్‌చెరులో 100 శాతం, సంగా రెడ్డిలో 76.43 శాతం వినియోగమైనట్లు సమీక్షలో వెల్లడైంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి ఎన్‌సీ ఏపీ కింద నల్గొండకు రూ. 4.83 కోట్లు, సంగారెడ్డికి రూ. 2.42 కోట్లు, మొత్తం రూ. 7.25 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో రహదారుల మెరుగుదల, పచ్చదనం, ఎలక్ట్రిక్ క్రిమేటోరియంలు తదిత ర చర్యలకు వార్షిక కార్యాచరణ ప్రణాళికలు టీజీపీసీబీ సిద్ధం చేసింది.

బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి పాలమూరు

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

- మోటార్లు రిపేర్ చేయకుండా రైతులను ఇబ్బందుల్లోకి నెట్టారు
- పనులు పూర్తికాకుండానే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు
- ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?
- పదేండ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?
- కల్వకుర్తి మోటార్ల దుస్థితికి బాధ్యత ఎవరిది?
- వాస్తవాలు తెలిసీ నిరంజన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, వెలుతురు అక్టోబర్ 7: మండలం ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న నీటి ఎద్దడి, సాగునీటి సమస్యలపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఖండించారు. కొల్లాపూర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం నీటి ఎద్దడి ఏర్పడిందని మంత్రి తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మాజీ మంత్రిగా నిరంజన్‌రెడ్డిపై ఉందని, కానీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాలను దాచిపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.

ఐదు మోటార్లు నడపాల్సింది మూడు మాత్రమే ఎందుకు?

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో ఐదు మోటార్లు పనిచేయాల్సి ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటి నిర్వహణ, మరమ్మతులపై తగిన శ్రద్ధ పెట్టలేదని జూపల్లి ఆరోపించారు. "మోటార్ల మరమ్మతులు చేపట్టాలని మేము ప్రయత్నిస్తున్నాం. అయితే ఒక మోటారును బయటకు తీసి మరమ్మతు చేయాలంటే మొత్తం కల్వకుర్తి లిఫ్ట్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంది. అలా చేస్తే వనపర్తితో పాటు మరో ఐదు నియోజకవర్గాలకు సాగునీటి సరఫరాపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. మిషన్ భగీరథ తాగునీటి అవసరాలు కూడా ఈ వ్యవస్థపై ఆధారపడి ఉన్నాయి. ఈ వాస్తవాలు నిరంజన్‌రెడ్డికి తెలియవా?" అని మంత్రి ప్రశ్నించారు. వానాకాలం పంట పనులు పూర్తయిన తర్వాత కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మోటార్ల మరమ్మతులు చేపట్టి, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు.

నార్లాపూర్ నుంచి నీళ్లు ఇవ్వాలన్నా పనులు పూర్తి కావాలి

నార్లాపూర్ నుంచి కూడా ప్రస్తుతం నీటిని అందించలేని పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. తండు పనులు పూర్తయిన అనంతరం నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. "ప్రజలకు నీళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం పనిచేస్తుంటే.. గతంలో బాధ్యతలు నిర్వహించిన వారు వాస్తవాలను వక్రీకరించి మాట్లాడటం వల్ల ప్రజలకు ఉపయోగం ఏమిటి?" అని ప్రశ్నించారు.

పాలమూరు--రంగారెడ్డిని పూర్తి చేయకుండానే అంకితం చేశారెందుకు?

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండానే అప్పటి ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేసిందని జూపల్లి విమర్శించారు. "కాలువల పనులు పూర్తికాలేదు. భూసేకరణ, అనుమతులు, అనుసంధాన పనులు వంటి అనేక అంశాలు పెండింగ్‌లో ఉండగానే ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేసినట్లు ప్రకటించారు. ఇప్పుడు ఆ అసంపూర్తి పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై పడింది" అని అన్నారు. ప్రభుత్వ అధికారిక ప్రాజెక్టు వివరాల ప్రకారం పాలమూరు--రంగారెడ్డి పథకం ఐదు దశల్లో నీటిని ఎత్తిపోసే విధంగా, 10 లక్షల ఎకరాల సాగు సామర్థ్యంతో రూపొందించబడింది.

కాళేశ్వరం, మల్లన్నసాగర్ పూర్తి చేశారు.. పాలమూరు ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు?

"కాళేశ్వరం, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ వంటి ప్రాజెక్టుల పనులు చేపట్టామని చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కీలకమైన పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదు?" అని మంత్రి నిలదీశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ పనులు ఉన్నాయని ప్రస్తుత ప్రభుత్వం కూడా పలు సందర్భాల్లో పేర్కొంది. "ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన నిరంజన్‌రెడ్డికి ఈ వాస్తవాలు తెలియవా? అప్పట్లో ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి సమస్యలకు కొత్త కారణాలు వెతకడం ఎంతవరకు సమంజసం?" అని జూపల్లి ప్రశ్నించారు.

'నా వ్యక్తిత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదు'

తన వ్యక్తిత్వంపై నిరంజన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా మంత్రి ఘాటుగా స్పందించారు. "నేను వ్యాపారం చేసుకుంటూ రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చి వ్యాపారం చేయడం లేదు. నా వ్యక్తిత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత నిరంజన్‌రెడ్డికి లేదు. తలకిందులుగా తపస్సు చేసినా నన్ను వేలెత్తి చూపే నైతిక హక్కు ఆయనకు లేదు" అని జూపల్లి అన్నారు. "నాకు మీలాగా రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తించి పార్టీ నాకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ప్రజల ఆశీర్వాదంతో గెలిచాను. పదవులు శాశ్వతం కావు.. ప్రజల కోసం చేసిన పని మాత్రమే గుర్తుండిపోతుంది" అని స్పష్టం చేశారు.

ప్రజలకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు.. నీళ్లు

"గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ, పెండింగ్ పనులను పూర్తి చేసి రైతులకు నీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. వాస్తవాలు తెలిసినవారు కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం మంచిది కాదు. రాజకీయాలు ఎన్నికల సమయంలో చేసుకోవచ్చు.. కానీ నీటి విషయంలో రైతుల ప్రయోజనాలే ముఖ్యం" అని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

అమెరికాలో 40 మంది

పౌరసత్వం రద్దు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(వెలుతురు): అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా అధికారుల ప్రకారం బల్విందర్ సింగ్ రెండు వేర్వేరు గుర్తింపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక గుర్తింపుతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన 2003లో మరో గుర్తింపుతో శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెంట్) పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత 2009లో అదే రెండో గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే రెండు వేర్వేరు దరఖాస్తుల్లో నమోదైన వేలిముద్రలను పరిశీలించిన అధికారులు అవి ఒకే వ్యక్తివని గుర్తించినట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ జాబితాలో అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నారు. చైనాకు గూఢచర్యం చేశారనే ఆరోపణలతో ఆయన ప్రస్తుతం 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వ్యక్తులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసం వంటి పలు ఆరోపణలు ఉన్నట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ 40 మందిలో ఒక్క దేశానికి చెందిన వారు మాత్రమే లేరు. మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియా సహా 20కి పైగా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. వీరిపై ఉన్న ఆరోపణలు, పౌరసత్వం పొందే సమయంలో వారు ఇచ్చిన సమాచారం ఇతర అంశాలను కోర్టులు పరిశీలించనున్నాయి. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం.. మోసం చేసి లేదా కీలకమైన సమాచారాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందినట్లు కోర్టులో రుజువైతే, వారి సహజీకృత పౌరసత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. పౌరసత్వం రద్దైన తర్వాత సంబంధిత వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరించే డిపోర్టేషన్ ప్రారంభం కావచ్చు. అయితే ఈ 40 మందిపై నమోదైన కేసులన్నీ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి.

రైతు వేదికలో జరిగిన సర్వసభ్య సమావేశం

- పాల్గొన్న మండల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 7: కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రోజున మండల సర్వసభ్య సమావేశాన్ని స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేశారు . ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు మరియు మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సర్పంచులు మాట్లాడుతూ వారి ఊరి సమస్యలు శాఖల వారీగా లేవనెత్తారు. దానికి సమాధానం సంబంధిత శాఖలవారు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ కృష్ణ, మండల విద్యాధికారి బాల్ రాజు వివిధ శాఖల అధికారులు మరియు జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు, మండల సర్పంచ్ ల అధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్, బోయిన వీరయ్య, కుద్బుద్దిన్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పద్మిని ఆరోపణలపై వెంటనే సిట్ ఏర్పాటు చేయాలి

- సాయి ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలి
- సుప్రీంకోర్టు లేదా హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి
- ఆరోపణలపై అమిత్‌షా, నితిన్ నబీన్ స్పందించాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 7 : పద్మిని ఆరోపణలపై వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి, సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీజేపీ ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్న పద్మిని ఒక వ్యక్తిపై ఫిర్యాదు చేశారని తెలిపారు. బీజేపీ యువ మోర్చా మాజీ జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్ 2024 డిసెంబర్ 24న పద్మినిని బెడ్‌రూమ్‌లోకి రమ్మని వేధించారని, 2025లోనూ ఇదే రకంగా వేధించారని ఆరోపించారు. పద్మినిని కులం పేరుతో దూషించారని, కృత్రిమ మేధ ద్వారా భయపెట్టే ప్రయత్నం చేశారని, రాత్రి సమయాల్లో ఫోన్ కాల్స్ చేసి ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పోలీసు మాన్యువల్ నడుస్తోందని, రేవంత్‌రెడ్డి చెబితేనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. సాయి ప్రసాద్‌పై 14 కేసులు ఉన్నాయని, ఆయనపై కచ్చితంగా రౌడీషీట్ ఉండాలని అన్నారు. సాయి ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సాయి ప్రసాద్‌కు ఉన్న ఐదు కంపెనీల్లో రెండు సంస్థలకు పొంగులేటి హర్షారెడ్డి కో-డైరెక్టర్‌గా ఉన్నారని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ రైడ్ జరిగినా ఇప్పటి వరకు ఏం జరిగిందో చెప్పలేదన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మధ్యవర్తిగా ఢిల్లీలో సాయి ప్రసాద్ డీల్ మాట్లాడారని ఆరోపించారు. దీనిపై అమిత్‌షా, నితిన్ నబీన్ స్పందించాలని డిమాండ్ చేశారు. గతంలో పోలీసు కుటుంబాలకు ఆరోగ్య భద్రత ఉండేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన ఎంప్లాయి హెల్త్ స్కీం లోపభూయిష్టంగా ఉందని ప్రవీణ్‌కుమార్ అన్నారు. అనారోగ్యానికి గురైన కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకున్న కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ దోస్తీ బలంగా ఉందని ఆరోపించారు. కరీంనగర్‌లో పోక్సో కేసులో బాధిత కుటుంబంపైనే ఉల్టా కేసు పెట్టించాలని చూశారని అన్నారు. రూ.50 వేల కోట్ల అవినీతిని సీఎం కుటుంబం చేసిందని ఆధారాలతో బయటపెట్టామని పేర్కొన్నారు. కామాంధులకు బీజేపీ జాతీయ స్థాయిలో పదవులు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. బీజేపీలో ఉన్న మహిళా నేతలు డీకే అరుణ, మాధవీలత, రాణి రుద్రమ సమాధానం చెప్పాలని అన్నారు. బీజేపీలో 30 ఏళ్ల నుంచి రాష్ట్రస్థాయి నాయకులు కాలేకపోయారని, సాయి ప్రసాద్ ఆరు సంవత్సరాల్లో బీజేవైఎం జాతీయ కోశాధికారి అయ్యారని తెలిపారు. సాయి ప్రసాద్ ప్రముఖులతో ఫొటోలు దిగారని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆయన పెళ్లికి హాజరయ్యారని అన్నారు. సాయి ప్రసాద్ ప్రయివేట్ జెట్లు ఏర్పాటు చేసి బీజేపీ నేతలను తిప్పుతారని ఆరోపించారు. నామ్‌కే వాస్తే కేసు పెట్టాలని ఫయీమ్, శ్రీరామ్ కర్రి చెప్పారట అని ప్రవీణ్‌కుమార్ అన్నారు. బండి సంజయ్‌పై ఇప్పటి వరకు బీజేపీ చర్యలు తీసుకోలేదని, పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీలో గతంలో బండి సంజయ్ అరెస్టు అయ్యారని తెలిపారు. మీనాక్షి నటరాజన్‌కు అన్యాయం జరిగినా బీఆర్ఎస్ పార్టీ మాట్లాడిందని అన్నారు. మల్రెడ్డి రంగారెడ్డిలాంటి వారిని రేవంత్‌రెడ్డి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణం చేస్తూ ఒక అమ్మాయిని ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. న్యాయ సలహా తీసుకుని మహిళా కమిషన్ చైర్మన్ మల్రెడ్డి రంగారెడ్డిని విచారణకు పిలవాలని, ఆయనపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో యాదయ్య గౌడ్, లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రీ-లాంచ్ పేరుతో రూ.500 కోట్ల మోసం!

సంస్థ ఛైర్మన్ పై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు

తెల్లాపూర్, అక్టోబర్ 07(వెలుతురు): తెల్లాపూర్‌లో ప్రీ-లాంచ్ ప్రాజెక్టు పేరుతో త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ సుమారు 350 మంది బాధితులు బుధవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులను ఆశ్రయించారు. ఫ్లాట్ల కోసం తమ నుంచి సుమారు రూ.500 కోట్లు వసూలు చేసి, నిర్మాణం చేపట్టకుండా మోసం చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ ఫౌండర్-ఛైర్మన్ పసుపులేటి సుధాకర్‌తో పాటు ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుల కథనం ప్రకారం, 2021లో తెల్లాపూర్‌లో "త్రిపుర నిర్వాణ" పేరుతో ఓ భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టును త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ ప్రకటించింది. మార్కెట్ ధరల కంటే తక్కువకే ఫ్లాట్లు ఇస్తామని ప్రీ-లాంచ్ ఆఫర్‌తో ఆకర్షించడంతో, ఎంతోమంది తమ కష్టార్జితాన్ని ఈ ప్రాజెక్టులో పెట్టుబడిగా పెట్టారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీడీఎల్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు అధికంగా ఉన్నారు. డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా, ఇంతవరకు కనీసం పునాది పనులు కూడా మొదలుపెట్టలేదని బాధితులు వాపోతున్నారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన భూమిని తమకు న్యాయం చేయకుండా మరో నిర్మాణ సంస్థకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు తమ ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ తెల్లాపూర్ ప్రాజెక్టుపై కేసులు నమోదు కావడం ఇది మొదటిసారి కాదు. ఇదే ప్రాజెక్టుకు సంబంధించి 10 మంది కొనుగోలుదారుల నుంచి రూ. 5.68 కోట్లు వసూలు చేశారని ఆరోపిస్తూ ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్ సీసీఎస్‌లో ఒక కేసు నమోదైంది. అంతకుముందు, 2025 నవంబర్‌లో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలోనూ 'త్రిపుర నిర్వాణ' పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో 9 మంది ఇన్వెస్టర్లు రూ. 4.41 కోట్లు నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ కేసులతో పాటు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ-రెరా) ఎదుట కూడా త్రిపుర కన్‌స్ట్రక్షన్స్‌పై పలు ఫిర్యాదులు ఉన్నాయి. తూప్రాన్ సమీపంలోని 'త్రిపుర సుకృతి' ప్రాజెక్టుకు సంబంధించి రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ప్లాట్లు విక్రయించినట్లు గతంలో టీజీ-రెరా నిర్ధారించింది. ఈ లావాదేవీలపై విచారణ జరిపి, తమ డబ్బును తిరిగి ఇప్పించాలని వారు పోలీసులను వేడుకున్నారు. కాగా, బాధితులు ఆరోపిస్తున్న రూ.500 కోట్ల సంఖ్యపై పోలీసుల దర్యాప్తు తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్థుల భవనం

- ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీసిన ప్రజలు
- శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం
- శిథిలాల నుంచి నలుగురిని కాపాడిన స్థానికులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(వెలుతురు): దేశరాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఓ ఐదు అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. కళ్లముందే భారీ భవనం నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు, హాహాకారాలు చెలరేగాయి. భారీ ఎత్తున శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో భవనం కూలిపోయినట్లు ఫైర్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం చేశాయి. జిల్లా డీసీపీ ఆర్తి బీనా స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం నలుగురిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే భవన యజమానితో పాటు ఒకే కుటుంబానికి చెందిన సుమారు ఆరుగురు వ్యక్తులు ఇంకా శిథిలాల కిందే చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద ఊపిరాడక అల్లాడుతున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రమాదానికి గురైన భవనం కేవలం 25 చదరపు గజాల విస్తీర్ణంలోనే నిర్మించినట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణాలు ఉండగా, పైన నాలుగు అంతస్తులను నివాసాల కోసం కేటాయించారు. ఈ భవన నిర్మాణం గతేడాదే పూర్తయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత తక్కువ విస్తీర్ణంలో సరైన పునాదులు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. భవనం కూలిన ఘటనతో ఆ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అడ్వైజరీ జారీ చేశారు. సీమాపురి రౌండ్‌అబౌట్, డీఎల్ఎఫ్ భోపురా, పరిసర మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. సహాయక చర్యలకు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఘటనా స్థలం వద్ద ప్రజలు గుమిగూడవద్దని, వాహనాలను రోడ్లపై నిలపవద్దని పోలీసులు హెచ్చరించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

మోదీ ప్రస్థానంపై ముస్లిం జమాత్ అధ్యక్షుడి ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(వెలుతురు): ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి వివక్ష లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్నాయని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ కొనియాడారు. పరిపాలనా రంగంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దేశంలోని ముస్లింలకు కూడా సమర్థవంతంగా అందుతున్నా యని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, "ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలాంటి వివక్షకు తావులేకుండా పౌరులందరికీ మేలు చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాల ద్వారా ముస్లింలకు ప్రయోజనం చేకూరడం లేదని కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి" అని రజ్వీ పేర్కొన్నారు. "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇళ్లలో నిరు పేద ముస్లింలు కూడా లబ్ధి పొందారు. అదేవిధంగా రైతు సంక్షేమ పథకాల్లోనూ హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా అర్హులైన పేద రైతులందరికీ సాయం అందుతోంది. పౌరుల భద్రతను పర్యవేక్షించడం, వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ప్రధాని మోదీ ఆ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు" అని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో, జునా అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. దేశ సేవలో మోదీ చూపు తున్న నిరంతర అంకితభావాన్ని ఆయన కొనియా డారు. 25 ఏళ్ల సుదీర్ఘ పాలనా ప్రస్థానం దేశం పట్ల ఆయనకున్న అంకితభావానికి, దృఢ సంకల్పానికి నిదర్శనమని ఇది అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు

స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో పర్యావరణ ప్రమాణాలు అద్భుతం

- 30 ఎకరాల్లో 33 వేల మొక్కలతో గ్రీన్ బెల్ట్
- ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య ప్రశంసలు

తుగ్గలి, వెలుతురు: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపిపిసిబి) చైర్మన్ పి.కృష్ణయ్య సోమవారం రోజున స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించి,ప్లాంట్‌లో అమలు చేస్తున్న పర్యావరణ నిర్వహణ విధానాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో పాటిస్తున్న పర్యావరణ ప్రమాణాలపై చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు గోల్డ్ మైన్స్ నిర్వాహకులు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన పర్యావరణ నిర్వహణ కోసం కంపెనీ చేపడుతున్న చర్యలను ఆయన అభినందించారు. ఇదే స్థాయి పర్యావరణ ప్రమాణాలను కొనసాగించాలని,ప్లాంట్ పరిసరాల్లో మరింతగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించినట్లు వారు తెలియజేశారు. కంపెనీ చేపడుతున్న హరిత కార్యక్రమాలను కూడా ఆయన అభినందించారు. ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 30 ఎకరాల గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఇప్పటివరకు 33,372 మొక్కలు నాటినట్లు ఆయన గుర్తించారు.అదేవిధంగా, ప్లాంట్‌లో అమలు చేస్తున్న నీటి నిర్వహణ మరియు వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను కూడా చైర్మన్ సమీక్షించారు. వనరులను సమర్థవంతంగా వినియోగించడం, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ఈ సందర్శన, సానుకూల అభిప్రాయాలు, ఉన్నత స్థాయి పర్యావరణ ప్రమాణాలను కొనసాగిస్తూ, స్థిరమైన, పర్యావరణహితమైన మైనింగ్ విధానాలను అమలు చేయడంలో కంపెనీకి ఉన్న నిబద్ధతను మరింతగా ధృవీకరిస్తున్నాయని ఆయన తెలియజేసినట్లు జనరల్ మేనేజర్ బాలాజీ,రాజేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జియో మైసూర్ సంస్థ టెక్నీషియన్స్,వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ నిలయం.. శ్రీవారి క్షేత్రం..

ఆకలికి చోటే లేని పవిత్ర స్థలం తిరుమల

- రోజుకు దాదాపు 3 లక్షల మంది భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం
- 15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద సేవ
- 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 9 కోట్లకు పైగా సర్వింగ్స్
- ఆధునికీకరణతో మరింత విస్తరిస్తున్న టీటీడీ అన్నప్రసాద సేవలు
- శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2900 కోట్లు దాటిన విరాళాలు

వెలుతురు, తిరుమల:

"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన, వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి" అన్న దైవ స్తోత్రానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచే తిరుమల పుణ్యక్షేత్రం భక్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణ నిలయంగా భాసిల్లుతోంది. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు శ్రీవారి కృపతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద సేవ అక్షయ పాత్రలా కొనసాగుతోంది. తిరుమలలో ఆకలితో ఉన్న భక్తుడికి అన్నం అందించడమే లక్ష్యంగా టీటీడీ అన్నప్రసాదం విభాగం 24 గంటలూ నిరంతరం పనిచేస్తోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, రద్దీ రోజులు, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షలకు మించుతోంది. పానీయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కలిపి రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి. 1985లో ప్రారంభమైన మహత్తర అన్నదాన సేవఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు సంకల్పంతో 1985 ఏప్రిల్ 6న తిరుమలలో శ్రీ వేంకటేశ్వర నిత్యాన్నదాన పథకం ప్రారంభమైంది. అనంతరం 1994 ఏప్రిల్ 1న ఈ పథకాన్ని ట్రస్టుగా మార్చారు. ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయి. తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను విస్తరిస్తున్నారు.మూడు ప్రధాన వంటశాలల్లో 24 గంటల సేవతిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శ్రీ అక్షయ వంటశాల, వకుళమాత వంటశాలలు 24 గంటలూ పనిచేస్తూ భక్తులకు ఆహారాన్ని అందిస్తున్నాయి.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రోజుకు 80 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందుతోంది. ఇక్కడ ఉదయం ఉప్మా, పొంగలి, చట్నీ, సాంబార్ వంటి అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి అన్నం, కూర, చట్నీ, వడ, సాంబార్, రసం, మజ్జిగ, స్వీట్ పొంగల్ తదితర పదార్థాలను భక్తులకు వడ్డిస్తున్నారు.శ్రీ అక్షయ వంటశాలలో గోధుమ రవ్వ ఉప్మా, సుజీ రవ్వ ఉప్మా, పొంగలి, సాంబారన్నం, పెరుగన్నం, టమోటా రైస్, సుండలు, పాలు, టీ, కాఫీ తదితరాలను తయారు చేస్తున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే పర్వదినాల్లో మజ్జిగ, బాదం పాలు, బిస్కెట్లు, జ్యూస్ ప్యాకెట్లను కూడా పంపిణీ చేస్తున్నారు.వకుళమాత వంటశాల ద్వారా యాత్రికుల వసతి సముదాయాలు, కేంద్రీయ విచారణ కార్యాలయం, రామ్‌భగీచా అతిథి గృహం, అంజనాద్రి నిలయం తదితర ప్రాంతాల్లోని భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.క్యూలైన్లలోనూ అన్నప్రసాదంవైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులతో పాటు నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల వెలుపల ఏర్పాటు చేసిన కేంద్రాలు, ఖంఅ అన్నప్రసాద భవనాలు, వివిధ వసతి సముదాయాల్లోని భోజనశాలల ద్వారా భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు.భక్తులు దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్న సమయంలో కూడా ఆకలితో ఇబ్బంది పడకుండా చూడటమే టీటీడీ అన్నప్రసాద విభాగం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది.

వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెకు సుజాత సల్మాన్ మద్దతు

రెగ్యులరైజేషన్ చేయాలి.. అప్పటివరకు వంద శాతం గ్రాస్ వేతనం చెల్లించాలి

అరకులోయ, వెలుతురు: అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రి ఎదుట వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు సూజతసల్మాన్ మద్దతు తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్యశాఖలో కీలకమైన సేవలు అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ఇప్పటికైనా రెగ్యులర్ చేయాలని ఆయన అన్నారు. రెగ్యులరైజేషన్ జరిగే వరకు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో సుమారు 450 మంది కాంట్రాక్టు ఉద్యోగులు సేవలందిస్తున్నారని తెలిపారు. స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది చాలాకాలంగా తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు హెల్త్ కార్డులు, ఇపిఎఫ్ సౌకర్యాలు, రిక్వెస్ట్ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.తమ న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నిస్తున్న ఉద్యోగులను టెర్మినేషన్ పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని సూజత అన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా సంవత్సరాల తరబడి సేవలు చేయిస్తున్న కాంట్రాక్టు విధానంపై ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల ప్రధాన డిమాండ్ వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి, సమ్మెను ముగిసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో పాంగి.నాగేశ్వరావు ల్యాబ్ టెక్నిసియన్ బి.పావని పార్మాసిస్ట్ పి.అప్పలరాజు ఎస్. రాంబాబు బుజ్జి ఉమాదేవి జి. రత్నకుమారి ఎన్. పుష్పావతి ఏ.రవి ప్రకాష్ ఎస్.సింహాద్రి కె.జానీబాబు బి.సోమేశ్ కె.సుబ్బలక్ష్మి కె.సంధ్యారాణి సుందరి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

25 ఏళ్ల ప్రజా సేవా శిఖరానికి నమో

- ఆధునిక ఉక్కు మనిషి ప్రధాని మోదీ వజ్రసంకల్పం నెరవేరాలి
- వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు

అమరావతి, వెలుతురు: దేశ శ్రేయస్సు-ప్రజాసంక్షేమమే లక్ష్యంగా 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న ఆధునిక ఉక్కుమనిషి ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ప్రధాని వికసిత్ భారత్ వజ్రసంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ అమరావతిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నారు. 2001 అక్టోబరు 7వ తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన మోదీ గారి ప్రస్థానం నేటితో 25 ఏళ్లు (రజతోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీద వెంకటపాలెం ఆలయంలో లోకేష్ పూజలు చేశారు. ప్రపంచంలోనే మన దేశం అన్నిరంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో నిస్వార్థంగా పనిచేస్తున్న ఆధునిక ఉక్కుమనిషి నరేంద్ర మోదీ గారికి ఆ శక్తియుక్తులన్నీ దేవుడు ప్రసాదించాలని లోకేష్ ప్రార్థించారు. మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ యాత్రగా నిర్వహించడం దేశాభివృద్ధి కోసం ప్రధాని చేస్తున్న కృషికి నిదర్శనం అని లోకేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు

అమరావతి, వెలుతురు అక్టోబర్ 07: 2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. నేడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటిచెప్పినందుకు వారిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రికెటర్ శ్రీచరణి, ఆర్చర్లు గణేశ్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలను శాప్ ఎండీ భరణి ముఖ్యమంత్రికి వివరించారు. మూడు వేర్వేరు క్రీడాంశాల్లో మన అథ్లెట్లు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 8 పతకాలను గెలుచుకున్నారని ఆయన తెలిపారు. ఈ విజయాల స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలతో పాటు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

అమరావతి, వెలుతురు అక్టోబర్ 07: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు.

కుమార్తె పెళ్లికి సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

అమరావతి, వెలుతురు అక్టోబర్ 07: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం..

- ఆటోలు, సుమోలు, జీపులపై ప్రత్యేక తనిఖీలు
- 17 కేసులు నమోదు రూ.60,000 జరిమానా
- ఆటో యూనియన్ నాయకులతో అవగాహన సమావేశం

తిరుపతి, వెలుతురు: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతికి వచ్చే భక్తులు, ప్రయాణికుల భద్రత, సౌకర్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా ఎస్పీ మరియు జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు తిరుపతి రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆటోలు, సుమోలు, జీపులపై రెండవ రోజు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ప్రత్యేక తనిఖీల్లో అధిక చార్జీల వసూలు, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి రూ.60,000/- జరిమానా విధించారు.ఆటో యూనియన్ నాయకులతో అవగాహన సమావేశం తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ నాయకులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్ణయించిన ఆటో చార్జీలను మాత్రమే ప్రయాణికుల నుంచి వసూలు చేయాలని, అధిక చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్న నేపథ్యంలో తిరుపతి నగరానికి మంచి పేరు వచ్చేలా ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు రవాణా శాఖకు సహకరించాలని యూనియన్ నాయకులను అధికారులు కోరారు.ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని, రవాణా నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి తిరుపతి కొర్రపాటి మురళీమోహన్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ పురుషోత్తం, ఓఎవ శ్రీనివాసరావు, అతికా నాజ్ మరియు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం..

- తల్లి, కొడుకు మృతి.. కూతురి పరిస్థితి విషమం

వెలుతురు, శ్రీకాకుళం: జిల్లాలోని ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు చిన్నారులతో కలిసి ఓ తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. చిలకపాలెంకు చెందిన మీనాక్షి(29) తన ఇద్దరు పిల్లలకు గడ్డి మందు పాలలో కలిపి ఇచ్చిన అనంతరం తాను కూడా సేవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం ముగ్గురినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో మీనాక్షి.. ఆమె ఏడు నెలల కుమారుడు కులదీప్ మృతి చెందారు. రెండున్నరేళ్ల కుమార్తె గాయిత్రి పరిస్థితి విషమంగా ఉంది. ఒకే కుటుంబానికి చెందిన తల్లీకొడుకులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై మృతురాలి తల్లి అమ్మాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మీనాక్షి భర్త జగదీష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబంలో నెలకొన్న కలహాల కారణంగానే ఈ ఘటన జరిగి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నప్పటికీ.. అసలు కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగిన పరిణామాలు.. విషపదార్థం వినియోగం తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఏపీలోని మద్యం షాపుల లైసెన్సులకు కొత్త నిబంధనలు

వెలుతురు, విజయవాడ: మద్యం షాపుల లైసెన్సుల జారీకి నిర్వహించే లాటరీ పై ఏపీ ఎక్సైజ్ శాఖ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాలకు కనీసం 4 దరఖాస్తులు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాలకు 6, అలాగే 5 లక్షలు దాటిన ప్రాంతాలకు 8 దరఖాస్తులు తప్పనిసరి చేసింది. మొత్తం 807 షాపులకు నోటిఫికేషన్లు జారీ కాగా.. 510 షాపులకు లాటరీ నిర్వహించనున్నారు.

బెజవాడలో యువతి దారుణ హత్య

వెలుతురు, విజయవాడ: బెజవాడలో సునీత అనే యువతి దారుణ హత్యకు గురైంది. నాగరాజు అనే వ్యక్తి కత్తితో పొడిచి సునీతను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. సునీత, నాగరాజు మధ్య ఉన్న వివాహేతర సంబంధమే హత్యకు కారణమైనట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకోవడంతో నాగరాజు కత్తితో సునీతపై దాడి చేసినట్లు సమాచారం. హత్య సమయంలో ఇద్దరి మధ్య పెనుగులాట జరగడంతో నాగరాజుకు కూడా గాయాలయ్యాయి. అనంతరం సునీతను హత్య చేసిన నాగరాజు అక్కడి సమీపంలోని కాలవలో దూకినట్లు పోలీసులు తెలిపారు.కాలవలో దూకి గాయపడిన నాగరాజును పోలీసులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలను పోలీసులు విచారిస్తున్నారు.

“యంగ్ ఇండియా” రయ్.. రయ్..

కొడంగల్ సీనియర్ హాస్టల్

ఊపందుకున్న పాఠశాలల నిర్మాణాలు

రాష్ట్ర వ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో పాఠశాలలకు ప్రణాళిక

87 చోట్ల వివిధ దశల్లో పాఠశాలల పనులు

నిర్మాణాలకు రూ. 1,144.85 కోట్ల నిధులు విడుదల

విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాముఖ్యతనిస్తున్నారు. చదువుతోనే అన్ని రంగాల్లో మార్పు సాధ్యమని నమ్మిన సీఎం విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బాల,బాలికలకు నాణ్యమైన విద్యనందిం చాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలల (వైఐఐఆర్ఎస్) ఏర్పాటుకు సీఎం శ్రీకారం చుట్టారు.

హైదరాబాద్, వెలుతురు:

విద్యార్థుల్లో సమైక్యత, సమగ్రత చిన్నతనం నుంచే పెంపొందించాలనే భిన్నమైన ఆలోచనతో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులందరినీ ఒకే చోట కలిపి కులమతాలకతీతంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా వైఐఐఆర్ఎస్‌లకు రూపకల్పన చేశారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో రెండు వైఐఐఆర్ఎస్‌లు నిర్మించనున్నారు. ఇందులో ఒకటి బాలికలకు, మరొకటి బాలురకు కేటాయిస్తారు. తొలి విడతలో 105 నియోజకవర్గాల్లో ఒక్కో వైఐఐఆర్ఎస్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే 87 పాఠశాలలు నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 18 పాఠశాలలకు పరిపాలన అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వీటి నిర్మాణాలకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 1,144.85 కోట్లు విడుదల చేసింది.

ఆధునిక వసతులు

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా వైఐఐఆర్ఎస్‌లకు రూపకల్పన చేశారు. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన-అభ్యసన సౌకర్యాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన వసతి గదులు,

ములుగు

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాలు, భోజన సముదాయాలు, బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలతో ఈ పాఠశాలలను నిర్మిస్తున్నారు.

తక్కువ వ్యయంతో ..

ఇంజినీరింగ్ నమూనాలు, ప్రస్తుత రేట్ల పట్టికలను ఆధారంగా చేసుకుని వైఐఐఆర్ఎస్ నిర్మాణ వ్యయ అంచనాలను పారదర్శకంగా రూపొందించారు. గతంలో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల కంటే తక్కువ నిర్మాణ వ్యయంతోనే అత్యాధునిక వసతులు కలిగిన ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నారు. 20 నుంచి 25 ఎకరాల్లో నిర్మించే ఒక్కో యంగ్ ఇండియా నివాస పాఠశాలలో సుమారు 2,650 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం సుమారు 5.36 లక్షల చదరపు అడుగులు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

శరవేగంగా నిర్మాణాలు..

ప్రభుత్వం తొలి దశల్లో 87 యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వీటిలో 79 పాఠశాలల నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వీటిలో 70 నియోజకవర్గాల్లో కాంట్రాక్టర్లు పాఠశాలల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పనులు వేగంగా జరుగుతున్నాయి. పాలకుర్తి, ఆసిఫాబాద్, గజ్వేల్, ముధోల్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని వైఐఐఆర్ఎస్‌లకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బోథ్, నిర్మల్ నియోజకవర్గాల్లో టెండర్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. శేరిలింగంపల్లి, సిర్పూర్, కామారెడ్డి, దుబ్బాక, సిరిసిల్ల, చంద్రాయణగుట్టలో పాఠశాలల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఇటీవలే కేటాయించారు. ప్రస్తుతం వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీలో యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లో అనువైన స్థలాల కోసం అన్వేషణ సాగుతోంది.

18 పాఠశాలల అనుమతులు త్వరలోనే

మొత్తం 105 నియోజకవర్గాల్లో ఇప్పటికే 87 పాఠశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 18 నియోజకవర్గాలకు సంబంధించిన ప్రక్రియ కూడా వేగంగా ముందుకు సాగుతోంది. కోరుట్ల, జనగామ, హుజురాబాద్, కరీంనగర్, అలంపూర్, సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, ఎల్బీ నగర్, మహేశ్వరం, సూర్యాపేట, ఉప్పల్, బాల్కొండ, నిజామాబాద్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా నివాస పాఠశాలలకు సంబంధించిన అంచనాలు పూర్తయ్యాయి. ఈ పాఠశాలలకు త్వరలోనే పరిపాలనపరమైన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. అనుమతులు లభించిన వెంటనే ఆ నియోజకవర్గాల్లోనూ టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

కార్పొరేట్‌కు దీటుగా..

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళుతోంది. పరిపాలన అనుమతులు, టెండర్లు, నిధుల విడుదల, నిర్మాణాల పురోగతి అన్నీ సమాంతరంగా సాగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆధునిక విద్యా ప్రాంగణాలు త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పరిశీలన

కొల్లాపూర్, వెలుతురు అక్టోబర్ 7: కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోలులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణం, చేపడుతున్న పనుల వివరాలు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, తదుపరి చేపట్టాల్సిన పనులపై అధికారులతో మంత్రి చర్చించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు అక్కడ కాసేపు క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. క్రీడాకారులతో మమేకమై క్రీడల ప్రాధాన్యాన్ని చాటారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

- ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 7: తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. “సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి” అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. “హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం” అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. “ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది” అని చెప్పారు. డిఇ షా నియోపోలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. “నియోపోలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం” అని శ్రీధర్‌బాబు అన్నారు.

ఉపాధి హామీకి ‘అక్టోబర్’ జోష్

రోజుకు 2.54 లక్షల మందితో సరికొత్త రికార్డు

గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా అక్టోబర్‌లో

రోజుకు 2.54 లక్షల మందికిపైగా హాజరు

ఫలితాలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక చర్యలు

వేజ్ సీకర్ల సంఖ్య మరింత పెంచాలని మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, వెలుతురు:

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గుతున్న పరిస్థితుల్లో గ్రామీణ కూలీలకు ప్రత్యామ్నాయంగా ఉపాధి హామీ పనులను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. అక్టోబర్ నెలలో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. మంగళవారం నాడు ఒక్కరోజే 2,54,812 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. వీబీ-జీ రామ్ జీ అమలు ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో నమోదైన అత్యధిక రోజువారీ కూలీల హాజరు ఇదే. గత ఐదేళ్ల అక్టోబర్ నెలలో రోజువారీ సగటు వేజ్ సీకర్ల సంఖ్యను పరిశీలిస్తే ఈ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది.

2025 అక్టోబర్‌లో రోజుకు సగటున కేవలం 24,750 మంది ఉపాధి హామీ పనులకు హాజరవగా, 2026 అక్టోబర్‌లో ఈ సంఖ్య 2.16 లక్షలకు చేరింది. అంటే గత ఏడాదితో పోలిస్తే రోజువారీ సగటు వేజ్ సీకర్ల సంఖ్య ఘననీయంగా పెరిగింది. ఎల్ ని నో కారణంగా వ్యవసాయ పనులు తగ్గుతున్న సమయంలో గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించేందుకు ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించడంతో పాటు జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పని కోరుతున్న ప్రతి కుటుంబానికి వీలైనంత త్వరగా పని కల్పించాలని, వేజ్ సీకర్ల సంఖ్యను మరింత పెంచేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కొత్తగా ఉపాధి హామీ కార్డులు కోరుతున్న వారికి 15 రోజుల్లోగా జాబ్ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పని కోరే కూలీలను గుర్తించి, వారికి అందుబాటులో ఉన్న పనుల వివరాలను తెలియజేసి, ఎక్కువ సంఖ్యలో కూలీలు పనుల్లో పాల్గొనేలా చూడాలని స్పష్టం చేశారు.

మంత్రి సీతక్క ఆదేశాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. కూలీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలను తెలుసుకోవడంతో పాటు, పని కోరుతున్న వారికి వెంటనే ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య గణనీయంగా పెరుగుతూ..మంగళవారం నాడు రికార్డు ను నెలకొల్పింది.

రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

- ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి
- ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారి ప్రశ్నలను అణచలేరు
- ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన రాహుల్ గాంధీకి అభినందనలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 7: “ప్రజల ఓటు విలువను కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు బారికేడ్లతో ఆపలేరు. ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారు లేవనెత్తిన ప్రశ్నలు మాయమైపోవు. సమాధానం కోసం నిలబడిన గొంతును అడ్డుకుంటే, ఆ ప్రశ్న మరింత బలంగా దేశమంతటా ప్రతిధ్వనిస్తుంది,” అని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల పారదర్శకత కోసం దృఢంగా నిలబడి, ప్రతిపక్ష నిరసనకు నాయకత్వం వహించిన రాహుల్ గాంధీకి ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ఎన్నికల సంఘం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంపై మరింత చర్చకు దారి తీసిందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై వివరణ కోరుతున్న నాయకులను అడ్డుకున్న దృశ్యాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయని అన్నారు. “బారికేడ్ల ఎత్తుతో ప్రజాస్వామ్య బలాన్ని కొలవలేరు. ప్రజల సందేహాలకు ఇచ్చే సమాధానాల స్పష్టతలోనే వ్యవస్థల బలం కనిపిస్తుంది,” అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షికతతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. “రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను నిలబెట్టేది అధికార దర్పం కాదు; ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలి. సంస్థను ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమంటూ భావించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం,” అని అన్నారు.

జైలు నుంచే ఉన్నత విద్య..

10 మంది ఖైదీలకు పీజీ పట్టాలు

హైదరాబాద్, వెలుతురు:

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవంలో తెలంగాణ జైళ్ల శాఖకు చెందిన 10 మంది ఖైదీలు పీజీ పట్టాలు అందుకున్నారు. వారిలో 8 మంది ఎం.ఎస్సీ (సైకాలజీ), 2 మంది ఎం.ఏ (సోషియాలజీ) పూర్తి చేశారు. ఇప్పటికే ఎల్‌ఎల్‌బీ, డిగ్రీ, బీటెక్ వంటి విద్యార్హతలు ఉన్న వీరు జైలులో ఉన్న సమయంలోనూ ఉన్నత విద్యను కొనసాగించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ స్నాతకోత్సవంలో డీఐజీ ప్రిజన్స్ డాక్టర్ డి. శ్రీనివాస్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్ పాల్గొని పట్టాలు అందుకున్న ఖైదీలను అభినందించారు. విద్య ద్వారా పరివర్తన.. పునరావాసం.. సమాజంలోకి పునఃప్రవేశం అనే లక్ష్యంతో జైళ్ల శాఖ చేస్తున్న కృషికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com